జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967



కృష్ణ | ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :241 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు



- ఢిల్లీలో ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- అతిథులు అందరికీ స్వాగతం పలికిన ప్రధాని మోదీ
- భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది
- స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రధాన్యతలు
- వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం

## ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

- బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- విభేదాలు పక్కనపెట్టి ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు
- భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం

## డీఎస్సీ నియామకాల్లో అర్హతకు పెద్దపీట



- డీఎస్సీపై ఫేక్ ప్రచారం
- పెద్ద అప్పలరాజు ఉద్యోగంపై లోకేశ్ క్లారిటీ
- నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన బాక్సర్ పెద్ద అప్పలరాజుకు డీఎస్సీలో టీచర్ ఉద్యోగం లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది

**అమరావతి**

మెగా డీఎస్సీ-2025 నియామకంపై వైఎస్సార్సీపీ బురద జల్లుతూనే ఉంది. అయితే ఈ రిక్రూట్‌మెంట్?లో అవకతవకలు జరిగాయని అర్హత లేనివారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపణలు గుప్పిస్తోంది. దీనిపై ఇటు అధికారులు, అటు సర్కార్ కౌంటర్ ఇస్తూనే ఉంది. ఈ క్రమంలోనే డీఎస్సీ నియామకాల్లో కూటమి ప్రభుత్వం అర్హతకు పెద్దపీట వేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కానీ వైఎస్సార్సీపీ మాత్రం ఫేక్ ప్రచారంతో క్రీడాకారులను అవమానిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్ పెద్ద అప్పలరాజుకు డీఎస్సీలో టీచర్ ఉద్యోగం లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని లోకేశ్ మండిపడ్డారు. - మిగతా3లో




## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి

- మోదీ సర్కార్‌కు కాంగ్రెస్ కీలక సూచనలు
- గ్లోబల్ సౌత్‌లో భారత్‌పై నమ్మకం పెంచాలన్న కాంగ్రెస్ ఇరాన్ విషయంలో ఉన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాలన్న హస్తం పార్టీ
- సమ్మిట్ వివరాలపై మోదీ ప్రెస్‌మీట్ పెట్టాలని డిమాండ్
- ఇరాన్ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిందే!
- యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయి

## సంజీవని ప్రాజెక్టు ప్రజారోగ్యంలో గేం ఛేంజర్

- ఆరోగ్య రంగంలో పెను మార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం
- ప్రపంచానికి కోవిడ్ వ్యాక్సిన్ అందించిన ఘనత భారత దేశానిది, ప్రధాని నరేంద్ర మోదీది
- ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించే చర్చ
- విజయవాడలో 249 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 9 క్రిటికల్ కేర్ యూనిట్లు 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు
- కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి క్రిటికల్ కేర్ యూనిట్లు ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా తగ్గనున్న ఖర్చు



**అమరావతి**

రాష్ట్రంలో అత్యవసర వైద్యానికి మరింత బలం చేకూర్చేలా నేటి నుంచి క్రిటికల్ కేర్ యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడలో 249 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 9 క్రిటికల్ కేర్ యూనిట్లు, 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిచారు. అంతకుముందు ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం విజయవాడ పాత ఆసుపత్రి వద్ద క్రిటికల్ కేర్ బ్లాక్‌ను - మిగతా3లో

## వచ్చే ఐదేళ్లలో రూ.64 వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం



- విజయవాడలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటించారు
- విజయవాడలో క్రిటికల్ కేర్ యూనిట్లు ప్రారంభించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది
- అమరావతి క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి కేంద్ర సహకారం ఉంటుందని హామీ
- క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు చేయాలన్న సీఎం ఆలోచన బాగుంది

**అమరావతి**

వైద్య ఆరోగ్య రంగంలో ఆంధ్రప్రదేశ్ మంచి ప్రగతి సాధిస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. విజయవాడ అంబేడ్కర్ కళావేదిక నుంచి రాష్ట్రంలో క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను సీఎంతో కలిసి నడ్డా ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సంజీవని అమలుపై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. అమరావతి క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి కేంద్ర సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు చేయాలన్న సీఎం ఆలోచన బాగుందని కితాబిచ్చారు. ఉమ్మడి, విభజిత ఏపీ అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర మరువలేమని - మిగతా3లో



## ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానే

- ప్రపంచంలోనే అత్యంత పారదర్శక ఎన్నికల వ్యవస్థల్లో భారత్‌ది ఒకటి
- భారత ఎన్నికల ప్రక్రియపై సీఈసీ కీలక వ్యాఖ్యలు
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు నిరంతరం పరిశీలనలో భాగస్వాములవుతున్నారు
- యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపు
- 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికల యంత్రాంగం బాధ్యత

## వినాయక చవితికి కిటకిటలాడుతున్న మార్కెట్లు

- వినాయక చవితికి మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి
- మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనిత సమీక్ష నిర్వహించి అధికారులకు సూచనలు
- వినాయక చవితికి కిటకిటలాడుతున్న మార్కెట్లు
- గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- అనుమతుల కోసం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి



# బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. సందర్భంగా మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకునేందుకు భారత్? సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదని ప్రధాని ఉద్ఘాటించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా గ్లోబల్ గవర్నెన్స్ మెరుగుపరచడానికి 10 సూత్రాలతో కూడిన ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రధాని మోదీ ప్రతిపాదించారు.

"మీ అందరికీ స్వాగతం పలకడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రధాన్యతలు. వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఈ దార్శనికతను దృష్టిలో ఉంచుకొని, 350 కిపైగా సమావేశాలు నిర్వహించాం. సుమారు 30 నగరాల్లో మీ బృందాలకు స్వాగతం పలికే అ వకాశం మాకు లభించింది. బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఇందులోని సభ్యదేశాల ప్రజలకు మనం భరోసా కల్పించాలి. పరస్పర సహకారంతో బ్రిక్స్ దేశాలు మరి అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా అంతర్జాతీయ సమస్యలకు మనం పరిష్కారం చూపించాల్సి ఉంది. మనం వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కాలం కావాలి. అంతేకాదు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కూడా సంస్కరణలు చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలను పరిష్కారం చూపించాలి. ఇందుకోసం మనం ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. అలాగే ఏఐ, సైబర్ స్పేస్?, బయోటెక్నాలజీ రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలి. అంతేకాదు గ్లోబల్ సౌత్ దేశాలకు దిశానిర్దేశం చేయాలి' అని మోదీ అన్నారు.

**బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు!**

"మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇదొక చారిత్రాత్మక మైలురాయి. మానవ జీవితంలో 20ఏళ్ల వయస్సు అనేది పరిణితి, బాధ్యతతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. ఇది బాధ్యతలు, ఆకాంక్షలతో ముడిపడే, సామర్థ్యాలను కొత్త దిశను కనుగొనే దశ. నేడు బ్రిక్స్ కూడా సరిగ్గా ఇలాంటి పరిణితి చెందిన దశలోనే ఉంది.



మనం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మన విధానం ఎవరికీ వ్యతిరేకం కాదు. అందరినీ కలుపుకుపోవడమే మన లక్ష్యం. ఇప్పుడు బ్రిక్స్? దేశాల ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైంది."

**సంస్కరణలు చేపట్టాల్సిందే!**

రానున్న 20 ఏళ్ల కోసం ఒక సరికొత్త, ప్రతిష్ఠాత్మకమైన ఎజెండాను రూపొందించాలని ప్రధాని మోదీ బ్రిక్స్? దేశాలకు పిలుపునిచ్చారు. "బ్రిక్స్ అధ్యక్ష పదవి ఏటా మారుతున్నప్పటికీ, అది మన సంస్థాగత వేగానికి ఆటంకం కలగకూడదు. ఇందుకోసం మన ఒక ప్రత్యేకమైన పర్యవేక్షణ వ్యవస్థను (ట్రోయ్కా-తీశీఱఝ ఖతీతీఝఅస్త్రవఎవత్) ఏర్పాటు చేయాలి. దీని వల్ల ఫలితాలను నిరంతరం పర్యవేక్షించడానికి వీలు కలుగుతుంది. అలాగే ప్రతి నిర్ణయానికి సంబంధించిన నోడల్ పాయింట్, కాలపరిమితి, పని ఎంత వరకు వచ్చిందో రికార్డు చేయడానికి ఒక సురక్షితమైన రిపోజిటరీ (డిజిటల్ స్టోరేజ్)ని ఏర్పాటు చేయాలి" అని మోదీ అన్నారు.

**బ్రిక్స్ మరింత బలోపేతం**

"బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రపంచ సంస్కరణల కోసం మనం ఒక మార్గాన్ని కూడా సుగమం చేయాలి. ప్రస్తుత ప్రపంచ పాలనా విధానం (గ్లోబల్ గవర్నెన్స్) నిర్మాణం ఒక పిరమిడ్?లా ఉంది. అధికారం, నిర్ణయాధికారాలు కేవలం పైనున్న కొన్ని దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కింది శ్రేణిలో ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితమవుతున్నప్పటికీ, వాటిని మార్చగల శక్తి వాటికి లేదు. అందుకే ఈ పద్ధతి మారాలి. ఇందుకోసం సంస్కరణలు చేపట్టాలని" మోదీ పేర్కొన్నారు.

**ఉమ్మడి ప్రకటన**

కాగా, ఈ రోజు బ్రిక్స్ దేశాలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రకటన చేయనున్నాయి. శనివారం జరిగిన సుదీర్ఘమైన చర్చల తర్వాత బ్రిక్స్ దేశాలు ఓ ఏకాభిప్రాయానికి వచ్చాయి. పలు వివాదాస్పద అంశాలపై భేదాభిప్రాయాలు వ్యక్తమయినప్పటికీ, భారత్? నిరంతర చర్చలు, సంప్రదింపుల ద్వారా సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించింది. ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ మధ్య ప్రాంతీయ, భౌగోళిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, వారంతా ఒకే వేదికపైకి వచ్చి ఈ ఉమ్మడి ప్రకటనకు అంగీకరించేలా చేయడంలో భారత్ విజయం సాధించింది.

# దిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

సభ్యదేశాల ఆమోదంతో బ్రిక్స్ దిల్లీ డిక్లరేషన్‌ను శనివారం ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. భారత్ దైత్యం ఫలితంగా, విభేదాలు పక్కనపెట్టి దిల్లీ డిక్లరేషన్‌కు అరబ్ దేశాలైన ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా ఆమోదం తెలిపడం విశేషం. ఈ ప్రకటనకు ముందు జరిగిన చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. ఎందుకంటే ప్రారంభంలో ఇరాన్, యూఏఈలు కఠిన వైఖరి అవలంభించాయి. బ్రిక్స్ అనేది పూర్తిగా ఏకాభిప్రాయంతో నడిచే కూటమి, కనుక ఏ ఒక్క సభ్యదేశం వ్యతిరేకించినా సరే ఉమ్మడి ప్రకటన నిలిచిపోతుంది. ఇలాంటి తరుణంలో భారత్ అద్భుతమైన దౌత్య విజయం సాధించింది. శనివారం జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో సభ్యదేశాలన్నీ ఏకాభిప్రా యంతో ఒక జాయింట్ డిక్లరేషన్‌ను ఆమోదించాయి. పశ్చిమాసియా సంక్షోభం విషయంలో ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ, తెరవెనుక జరిగిన వరుస చర్చల ఫలితంగా ఈ ప్రతిష్టంభనకు తెరపడింది. దీనితో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఈ జాయింట్ డిక్లరేషన్ ఆమోదం పొందినట్లు తాజాగా అధికారికంగా ప్రకటించారు.

**పాత వ్యవస్థలు ఇక పనికిరావు!**

ఈ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్?పింగ్?తో కరచాలనం చేస్తూ కనిపించారు. సదస్సు ముగింపు ఉపన్యాసంలో మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "మారుతున్న ప్రపంచాన్ని పాతపడిపోయిన వ్యవస్థలు నడపలేవు. నేటి చర్చల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ప్రాతినిధ్యం, స్పందన, నియమ నిబంధనల రూపకల్పనలో కచ్చితంగా సంస్కరణలు అవసరం. అలాగే భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలో, వాటి నియంత్రించే నిబంధన రూపకల్పనలో గ్లోబల్ సౌత్? దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని మేము నొక్కి చెప్పాము. నిర్ణయాలకు, వాటి ఫలితాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని- భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణ ద్వారా మాత్రమే పూడ్చగలం. ఈ రోజు ఆమోదించిన దిల్లీ డిక్లరేషన్? మన ఉమ్మడి సంకల్పానికి ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చవలసిన బాధ్యత ఇప్పుడు మనందరిపైనై ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.

**డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం**

వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానే

భారత ఎన్నిక వ్యవస్థపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని అన్నారు. ఓటర్ల జాబితాల తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ ధ్రువీకరణ జరుగుతోందని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు నిరంతరం పరిశీలనలో భాగస్వాములవుతున్నారని, అందుకే ప్రపంచంలోనే అత్యంత పారదర్శక ఎన్నికల ప్రక్రియల్లో భారత్‌ది ఒకటని పేర్కొన్నారు. గుజరాత్ యూనివర్సిటీలోని అటల్ కలాం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బూత్ లెవల్ ఆఫీసర్లతో పరస్పర సమావేశం కార్యక్రమంలో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానేనని జ్ఞానేశ్ కుమార్ అన్నారు. రాజకీయ పార్టీలు, వారి బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) భాగస్వామ్యంతో ఓటర్ల జాబితాలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని అన్నారు. లేని వారు, వేరే ప్రాంతానికి తరలిపోయిన వారు మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, విదేశీయుల పేర్లు వంటి అంశాలను గుర్తించాల్సి ఉంటుందని వివరించారు. అదే సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికల యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. యువతకు ఓటు హక్కు లభించిన వెంటనే వారి పేర్లను నమోదు చేసే ప్రక్రియపై బీఎల్ఓలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. బీఎల్ఓలు తమ ప్రాంతాల్లోని ఓటర్ల



ఇళ్లకు వెళ్లి నేరుగా వివరాలను సేకరించి, అవసరమైన సమాచారాన్ని ధ్రువీకరిస్తున్నారని తెలిపారు. తగిన పత్రాల సమర్పణ, వివరాల మ్యాపింగ్, అవసరమైన చోట విచారణ వంటి ప్రక్రియల ద్వారా ఓటర్ల జాబితాల కచ్చితత్వాన్ని పెంచుతున్నట్లు వివరించారు.

**ఈవీఎం, వీవీప్యాట్‌లపైనా ధ్రువీకరణ**

పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను ఈవీఎం, వీవీప్యాట్ తనిఖీలు కీలకమని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పోలింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్? పోలింగ్ నిర్వహించి యంత్రాల పనితీరును పరిశీలిస్తారని చెప్పారు. పోలింగ్ పూర్తైన తర్వాత ఈవీఎంల్లో నమోదైన ఫలితాలకు సంబంధించిన ప్రక్రియను కూడా అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలోనే పూర్తి చేస్తారని వివరించారు అవసరమైన పత్రాలపై వారి సమక్షంలో సంతకాలు తీసుకుంటారని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలోనూ పలు దశల్లో ధ్రువీకరణ ఉంటుందని సీఈసీ వెల్లడించారు. ఈవీఎంలలో నమోదైన ఓట్ల సంఖ్యను ఫామ్-17సీలో పేర్కొన్న ఓట్ల వివరాలతో అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో సరిపోల్చుతారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశలో అభ్యర్థులు, వారి ప్రతినిధులకు పరిశీలించే అవకాశం ఉండటం వల్లే వ్యవస్థ పారదర్శకంగా కొనసాగుతోందని వివరించారు.

**ఓటర్ల జాబితాల స్వచ్ఛతకు ప్రత్యేక చర్యలు**

ఓటర్ల జాబితాల స్వచ్ఛత, కచ్చితత్వాన్ని కాపాడేందుకు ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపడుతోందని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. బీఎల్ఓలు తమకు సమయం దొరికినప్పుడల్లా సంబంధిత ప్రాంతంలోని ఓటర్ల జాబితాను పరిశీలించాలని సూచించారు. అర్హులైన యువ ఓటర్ల పేర్లను చేర్చేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. దేశ ప్రజాస్వామ్యానికి ఇది అందించగల గొప్ప సేవల్లో ఒకటని అన్నారు.

**యువతకు 'ఈసీఐనెట్'పై అవగాహన**

అహ్మదాబాద్‌లో జరిగిన 'ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ అండ్ ఈసీఐనెట్' ఐదో ప్రాంతీయ సదస్సులోనూ సీఈసీ పాల్గొన్నారు. యువతలో ఎన్నికల అవగాహన, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంపై ఈ సమావేశంలో చర్చించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రజలకు ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకునే విషయంలో సహకరించాలని జ్ఞానేశ్ కుమార్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు యువతలో ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.

## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి

బ్రిక్స్ వేదికగా భారత్ తన దౌత్య బలాన్ని మరోసారి చాటుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బ్రిక్స్ సదస్సు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పలు సూచనలు చేసింది. సంక్షోభ సమయాల్లో భారత్ నమ్మకమైన, నిర్మాణాత్మక భాగస్వామిగా నిలవాలని కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. భారత్ గతంలో అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రత్యేకమైన దౌత్య స్థానం కలిగి ఉండేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు ఆ స్థానం, దౌత్యపరమైన ప్రభావాన్ని తిరిగి సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా ఉంటుందని చెప్పడం మాత్రమే కాకుండా అందుకు తగ్గట్టుగా చర్యలు కూడా ఉండాలని ఖుర్షీద్ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌పై జరిగిన దాడుల విషయంలో భారత్ వైఖరిపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఆ అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో భారత్ దౌత్యపరమైన పాత్ర పరిమితంగా ఉందని విమర్శించింది. బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో కూడా ప్రభుత్వం తగినంత ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. అదే సమయంలో దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశం దక్షిణాఫ్రికాకు భారత్ నుంచి మరింత మద్దతు ఉండాల్సిందని పేర్కొంది.

**బ్లాక్ రాజకీయాలకు దూరంగా!**

ప్రస్తుత బ్రిక్స్ సదస్సును భారత్ దౌత్య నైపుణ్యాన్ని చూపించేందుకు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సూచించింది. సభ్య దేశాల మధ్య ఐక్యత పెంచాలి కానీ బ్రిక్స్‌ను మరో అంతర్జాతీయ బ్లాక్‌గా మార్చే రాజకీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థలు, అనుసంధానం వంటి అంశాల్లో భారత్ ముందుండాలని సూచించింది. భారత్ తన ప్రయోజనాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన ప్రపంచ వ్యవస్థ కోసం పనిచేసే దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా ఉండాలని కాంగ్రెస్ తెలిపింది. గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్ మధ్య భారత్ ఒక విశ్వసనీయమైన వారధిగా వ్యవహరించాలని పేర్కొంది. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వస్తు వాణిజ్యంలో 19.6 శాతం వాటా కలిగి ఉన్నాయని ఖుర్షీద్ తెలిపారు. అయితే బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు సమతూకంగా లేవని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ ఉపయోగించుకోవాలని సూచించారు. భారత వస్తువులు, సేవలకు మరింత మార్కెట్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఇతర దేశాల్లో భారత కంపెనీలు ఎదుర్కొంటున్న వాణిజ్య అడ్డంకులను తగ్గించాలని పేర్కొంది. అదే సమయంలో భారత సంస్థలకు పోటీ చేసేందుకు న్యాయమైన, స్పష్టమైన అవకాశాలు కల్పించాలని సూచించింది. బ్రిక్స్ పే వ్యవస్థపై జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ స్వాగతించింది. సరఫరా వ్యవస్థలు, అనుసంధానంపై కూడా సభ్య దేశాల మధ్య ఒప్పందాలు కుదరాలని కోరింది. 2014లో ఏర్పాటు చేసిన కాంటింజెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించింది. ఇందులో భారత్ 18 బిలియన్ డాలర్ల నిధులకు హామీ ఇచ్చిందని ఖుర్షీద్ గుర్తు చేశారు.

**ఐరాసలో శాశ్వత సభ్యత్వం**

భారత్ దీర్ఘకాలంగా కోరుతున్న ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి బ్రిక్స్ దేశాల మద్దతు పొందేందుకు ప్రయత్నించాలని కాంగ్రెస్ తెలిపింది. 2021లో భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో తీసుకున్న నిర్ణయాల ముందుకు వెళ్లేలా చూడాలని కోరింది. అంతేకాదు బ్రిక్స్ సదస్సులో ఏం చర్చించారు? ఏ నిర్ణయాలు తీసుకున్నారు? అనే విషయాలను దేశ ప్రజలకు వివరించేందుకు ప్రధాని మోదీ ప్రెస్‌మీట్ నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు భారత్ అంతర్జాతీయ వ్యవహారాల్లో స్వతంత్ర వైఖరితో వ్యవహరించిందని కాంగ్రెస్ పేర్కొంది. పశ్చిమాసియా, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటం, వలస పాలనకు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న వైఖరిని ఇందుకు ఉదాహరణలుగా చూపింది. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే, ప్రపంచ వేదికపై నైతిక నాయకత్వం, వ్యూహాత్మక స్పష్టతను చూపించాల్సిన సమయం ఇదేనని కాంగ్రెస్ పేర్కొంది. బ్రిక్స్‌ను భద్రత, ఆర్థికాభివృద్ధి, సమానత్వం కోసం మరింత ప్రభావవంతమైన వేదికగా మార్చేందుకు భారత్ కీలక పాత్ర పోషించాలని కోరింది

## ముంబయి ఉగ్రదాడుల సూత్రధారిపై మళ్లీ నాన్ బెయిలబుల్ వారెంట్



ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌పై మరోసారి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడిగా ఉన్న హఫీజ్ సయీద్ ప్రస్తుతం పాకిస్థాన్‌లోనే ఉన్నాడని జాతీయ దర్యాప్తు సంస్థ జమ్మూలోని ప్రత్యేక కోర్టుకు తెలిపింది. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాదులకు ఆయుధాలు, డబ్బు, ఆదేశాలు అందిస్తున్నాడని ఆరోపించింది. హఫీజ్ సయీద్‌పై రెండు నెలల వ్యవధిలోనే జమ్మూలోని ప్రత్యేక చీ×ూ కోర్టు రెండోసారి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 8న ఆ కేసును విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమ్ సాగర్, దర్యాప్తులో హఫీజ్ సయీద్ ప్రమేయం బయటపడిందని, అతడు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ వారెంట్ జారీ చేశారు.

**కేసు అసలు ఎలా బయటపడిందంటే?**

ఈ ఏడాది ప్రారంభంలో శ్రీనగర్ శివార్లలోని పాండచ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మహమ్మద్ నఖీబ్ భట్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద చైనాలో తయారైన ఓ గ్రెనేడ్‌తో పాటు 15 లైవ్ రౌండ్లు లభించాయి. దీంతో బట్‌పొరాకు చెందిన మహమ్మద్ నఖీబ్ భట్‌పై కేసు నమోదు చేశారు. జకూరా పోలీస్ స్టేషన్‌లో అతడిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసుపై దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ కశ్మీర్‌లో పనిచేస్తున్న ఓ పెద్ద ఉగ్ర నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో లష్కరే తోయిబాతో పాటు దాని అనుబంధ సంస్థగా పేర్కొంటున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ తో సంబంధాలున్న పలువురిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు కూడా ఉన్నారు.

**హఫీజ్ సయీద్ పేరు ఎలా వచ్చింది?**

ఈ దర్యాప్తులోనే హఫీజ్ సయీద్ పేరు బయటకు వచ్చిందని చీ×ూ కోర్టుకు తెలిపింది. నిషేధిత ఉగ్ర సంస్థ లష్కరే తోయిబాకు హఫీజ్ సయీద్ అమీర్, చీఫ్, ఫౌండర్?గా వ్యవహరిస్తున్నాడని దర్యాప్తు సంస్థ పేర్కొంది. అరెస్టయిన పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులకు అతడితో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపింది. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాదులకు హఫీజ్ సయీద్ పాకిస్థాన్ నుంచి సహాయం అందిస్తున్నాడని చీ×ూ ఆరోపించింది. ఆయుధాలు, నిధులు సమకూర్చడంతో పాటు ఉగ్రవాదులకు అవసరమైన ఆదేశాలను కూడా ఇస్తున్నాడని కోర్టుకు వివరించింది. అతడు పాకిస్థాన్‌లోనే ఉన్నాడని సమాచారం ఉందని, ఉద్దేశపూర్వకంగానే భారత్‌కు దూరంగా ఉంటూ అరెస్టు నుంచి తప్పించుకుంటున్నాడని చీ×ూ తెలిపింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లోని సర్గోధాకు చెందిన వ్యక్తిగా హఫీజ్ సయీద్‌ను చీ×ూ తన దరఖాస్తులో పేర్కొంది.

# సంజీవని ప్రాజెక్టు ప్రజారోగ్యంలో గేం ఛేంజర్

-మొదటిపేజీ తరువాయి

కేంద్ర మంత్రి ప్రారంభించారు. 9 సీసీ బ్లాకులు, 12 పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు నుంచి ప్రారంభించబోతున్న సంజీవని ప్రాజెక్టు ప్రజారోగ్యంలో గేం ఛేంజర్ కాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రిడిక్టివ్-ప్రివెంటివ్-క్యూరేటివ్-కాస్ట్ ఎఫెక్టివ్‌తోపాటు సంజీవిని ప్రాజెక్టు తీసుకొచ్చామని. జనవరి-1 నుంచి ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని అన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా నాయకత్వంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం మరింత మెరుగవుతుందనే నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో వైద్యారోగ్యానికి నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డాకు ధన్యవాదాలు తెలిపారు. ఇది డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే సాధ్యమైందని చెప్పారు. గత 12 ఏళ్లుగా వైద్య రంగంలో కేంద్రం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు.

ప్రపంచానికి కోవిడ్ వ్యాక్సిన్ అందించిన ఘనత భారత దేశానిది, ప్రధాని నరేంద్ర మోదీది అని అన్నారు. 51 వేల మెడికల్ సీట్ల నుంచి రెండింతల కంటే ఎక్కువగా మెడికల్ సీట్లు పెంచారని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్?ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు ఇస్తున్నారని, అభా కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. అమరావతి గురించి లడ్డాఖ్?లో చర్చించుకుంటున్నారని- ఇటీవల ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్ అవుతోందని అన్నారు. అమరావతికి అన్ని చోట్లా అన్ని ప్రాంతాల్లో గుర్తింపు వచ్చిందని చెప్పారు.

**ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించే చర్చ**

భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫస్ట్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే ప్రారంభం కానుందని అన్నారు. అమరావతి క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని, అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని అన్నారు. ఏఐ ప్రొఫెషనల్స్?ను సిద్ధం చేస్తున్నామని యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఫార్మా రంగానికి ఏపీ చిరునామాగా ఉందని, మెడ్ టెక్ పార్క్ ద్వారా మెడికల్ ఎక్విప్మెంట్ ను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. వంటగది ఫార్మసీగా ఆహారమే ఔషధంగా భావించాలని దానికి అనుగుణంగా ఆహార అలవాట్లు మార్చుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

ఈ సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే టెక్నాలజీని అందిపుచ్చుకుంటే వైద్యారోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించగలమని చంద్రబాబు అన్నారు. వైద్యారోగ్య రంగంలోనే కాదు, టెక్నాలజీని అందిపుచ్చుకుంటే వచ్చే 10 ఏళ్లల్లో అద్భుతమైన ప్రగతిని సాధించగలమని అన్నారు. వైద్యారోగ్యంతోపాటు వివిధ రంగాల్లో ఏపీని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర సహకారం రాష్ట్ర సంకల్పం ప్రజల భాగస్వామ్యంతో ఏపీ నెంబర్-1 స్థానంలో నిలుస్తుందన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలి కలిసి రావాలని కోరారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటివి తప్పనిసరిగా ఆచరించాలని- యోగాభ్యాసంతో ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని- ఇందుకు వైద్య విద్యార్థులు, ప్రజలు కలిసిరావాలని చంద్రబాబు కోరారు.

**పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా తగ్గనున్న ఖర్చు**

“500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా ఖర్చు తగ్గుతుంది. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తాం. సంజీవని ప్రాజెక్టు గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌గా మారబోతోంది. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలామందికి ప్రయోజనం చేకూరుతుంది. నడ్డా నాయకత్వంలో ఆరోగ్య రంగంలో కొత్త ఆవిష్కరణలు వచ్చాయి. ఆరోగ్య రంగంలో పెను మార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం. అర్హులైన వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా. 2047 నాటికి ప్రపంచంలోనే మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

“కేంద్ర సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఏపీ దేశంలోనే నెంబర్ 1 స్థానంలో నిలుస్తుంది. ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తుంది. ప్రజలు తమ జీవనశైలి, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. వ్యాధుల నివారణకు సేంద్రీయ వ్యవసాయం విధానమే అత్యుత్తమ మార్గం. ప్రతి ఒక్కరు ఆర్గానిక్ ఆహారంతో పాటు యోగా, వ్యాయామం చేయాలి. ప్రాణాయామం ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలి. ఎంత ఒత్తిడి ఉన్నా రోజులో కేవలం 10 నిమిషాలు ప్రాణాయామం చేయాలి. ప్రాణాయామం, ధ్యానం చేస్తే ఎనర్జీ లెవెల్స్ అద్భుతంగా ఉంటాయి. ‘హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ’ లక్ష్య సాధనలో వైద్య విద్యార్థులు ప్రధాన సారథులుగా నిలవాలి.”

అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స : అయితే కొత్తగా అందుబాటులోకి వచ్చిన క్రిటికల్ కేర్ బ్లాకుల్లో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక విభాగాల సేవలు అందుతాయి. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ఇవి కీలకంగా మారుతాయి. కేంద్రం మంజూరు చేసిన 26 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీల్లో ఇప్పటికే 14 పనిచేస్తున్నాయి. తాజాగా మిగిలిన ల్యాబరేటరీలు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో మైక్రోబయాలజీ, హీమటాలజీ వంటి కీలక పరీక్షలు జిల్లా స్థాయిలోనే నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. జిల్లా స్థాయిలోనే వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఐపీహెచ్ ల్యాబరేటరీలు దోహదపడనున్నాయి. ముఖ్యంగా వివిధ రకాల వ్యాధుల నిర్ధారణలో అవసరమైన పరీక్షలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు వేగంగా వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. వైద్య మౌలిక వసతులను క్రమంగా విస్తరిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఈ ప్రాజెక్టులు కీలక అడుగుగా నిలవనున్నాయి.

# పాదయాత్రే.. సర్వరోగనివారిణి....

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల క్యాడర్‌తో, నేతలతో మాట్లాడేటప్పుడు కళ్లు మూసుకుందాం.. కాలం గడిచిపోతుంది అనే ఊతపదాన్ని పదే పదే వాడుతుండటం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిత్యం క్షేత్రస్థాయిలో ఎండగట్టడం, ప్రజల్లో ఉండి నిరసనలు చేయడం కంటే.. ఐదేళ్ల కాలాన్ని దాటవేయడమే ప్రధాన వ్యూహంగా ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. మరో ఏడాది ఓపిక పడితే కళ్లు మూసుకునేలోపు పాదయాత్ర సమయం వచ్చేస్తుందని, ఆ ఒక్క పాదయాత్ర చేస్తే చాలు మళ్లీ ఓటర్లు బ్రహ్మరథం పడతారని క్యాడర్‌కు నూరిపోస్తున్నారు. అయితే, వైసీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన రాజకీయ, సంస్థాగత సమస్యలకు పాదయాత్ర అనేది సర్వరోగ నివారిణి అని జగన్ నమ్మడం ఎంతవరకు సమంజసం?ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో పాదయాత్రలకు ఒక ప్రత్యేకమైన గ్లామర్, ఆకర్షణ ఉండేవి. వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఆ తర్వాత వైఎస్ జగన్ చేసిన పాదయాత్రలు వారిని అధికార పీఠం ఎక్కించాయన్నది పచ్చి నిజం. కానీ, ఒకే రాజకీయ వ్యూహం ప్రతిసారీ పలికిస్తుందనుకోవడం పొరపాటే. 2019 నాటికి ఉన్న పరిస్థితులు, సోషల్ మీడియా ప్రభావం, ఓటర్ల మానసిక స్థితి వేరు.. నేటి పరిస్థితులు వేరు. ఒకప్పుడు పర్యటనల ద్వారా ప్రజలను కలవడం కొత్తగా ఉండేది, కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో నాయకుడి ప్రవర్తన, ప్రతిస్పందనలు ప్రతిరోజూ ప్రజల వద్దకే చేరుతున్నాయి. కేవలం ఎన్నికల ముందు ఐదు వేల కిలోమీటర్లు నడిచేస్తే అధికార పీఠం దక్కేంత అమాయకంగా నేటి ఓటర్లు లేరు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడటం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను ముందుకు నడిపించడం ప్రధాన బాధ్యత. కానీ, “కళ్లు మూసుకుంటే ఐదేళ్లు గడిచిపోతాయి అనే ధోరణి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు, కేసులు, స్థానిక వివాదాల్లో తమకు అండగా నిలబడే నాయకత్వం కరువైందనే భావన వైసీపీ శ్రేణుల్లో ఉద్భవిస్తోంది. ప్రజా పోరాటాలు చేయకుండా,



కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై ఎన్నికల ముందు వస్తా అని చెప్పడం వల్ల పార్టీ క్షేత్రస్థాయి పునాదులు మరింత బలహీనపడే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి.నేటి ఓటర్లు, ముఖ్యంగా జెన్ జీ, తటస్థ ఓటర్లు ఒక నాయకుడు నిరంతరం ఎలా స్పందిస్తున్నాడు, అసెంబ్లీకి వెళ్తున్నారా లేదా, ప్రజా సమస్యలపై ఎలాంటి ప్రతిపాదనలు ఇస్తున్నారనేది గమనిస్తున్నారు. 2019లో ఇచ్చిన హామీలు, ఆ తర్వాత ఐదేళ్ల పాలనను అనుభవించిన ప్రజలు, ఇప్పుడు కేవలం ఓదార్పులు లేదా సుదీర్ఘ నడకలకే ఓటేస్తారని భావించడం రాజకీయ అపరిపక్వత కిందకే వస్తుంది. పాదయాత్రలకు ఉన్న వాల్యూ కాలక్రమేణా తగ్గిపోయింది. పవన్ కల్యాణ్ చేసిన వారాహి యాత్ర లేదా లోకేష్ చేసిన యువగళం పాదయాత్రలు సైతం సాంప్రదాయ పాదయాత్రల రూపురేఖలను మార్చేశాయి. ఈ నేపథ్యంలో జగన్ పాత తరహా పాదయాత్రనే మళ్లీ నమ్ముకోవడం పెద్ద రిస్క్.వైసీపీ ఎదుర్కొంటున్న అసలు సమస్య పాదయాత్ర లేకపోవడం కాదు. ప్రతి చిన్న విషయానికీ అధినేతపైనే ఆధారపడే సంస్కృతి ఉంది. ఇలాంటి సమయంలో కళ్లు మూసుకుందాం అనే మంత్రం జపిస్తే.. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికికే ప్రమాదం వస్తుంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న పార్టీకి, నిరంతర ప్రజా ఉద్యమాలే ఊపిరి పోస్తాయి తప్ప, రాబోయే పాదయాత్ర కోసం చేసే నిరీక్షణ కాదు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ను ఒక మాయాజాలంగా భావిస్తున్నారు. కానీ రాజకీయాల్లో కాలం దానంతట అదే మాయలు చేయదు. ప్రజా సమస్యలపై పోరాడకుండా, కేవలం కళ్లు మూసుకుని కాలం గడిపేస్తే మళ్లీ జనం ఓటేస్తారనుకోవడం రాజకీయ భ్రమ మాత్రమే. 2029 నాటికి రాజకీయ సమీకరణాలు, జనాభా మార్పులు, ఓటర్ల ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో అంచనా వేయకుండా, ఒకే సెంటిమెంట్‌ను పదే పదే నమ్ముకుంటే అది వైసీపీకే పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉందనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అభిప్రాయం

# చిన్న శీను ఓపెనర్ మాత్రమే!

**విజయనగరం :** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన



సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

## వచ్చే ఐదేళ్లలో రూ.64 వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నడ్డా చెప్పారు. ఏపీలో రూ.1,271 కోట్లతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 45 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించబోతున్నామని తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడారు. చంద్రబాబుతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

గత దశాబ్ద కాలంగా దేశంలో ఎన్నో ఆరోగ్య విధానాలు తీసుకొచ్చామని కేంద్రమంత్రి జేపీ నడ్డా అన్నారు. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు గర్విస్తున్నానన్నారు. ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనలో ఇదో ముందడుగు చేశారన్నారు. ఇలాంటి కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. కొవిడ్ తర్వాత ఆరోగ్య వ్యవస్థలను పటిష్టం చేయడంపై మోదీ దృష్టి సారించారన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ.64 వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయబోతున్నామన్నారు. వంటగదే ఫార్మసీ, ఆహారమే ఔషధమని చంద్రబాబు తరచూ చెబుతారని, అది అక్షరాలా నిజమని జేపీ నడ్డా పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

**మిషన్ ఇంద్రధనుస్సులో ఏపీ అగ్రస్థానంలో**

అలాగే వ్యాధి వచ్చాక నయం చేయడం కాకుండా, 2017 జాతీయ ఆరోగ్య విధానం ప్రకారం ప్రివెంటివ్, ప్రమోటివ్ వంటి వైద్య విధానాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. యు-విన్ టెక్నాలజీ ద్వారా పిల్లలకు పుట్టినప్పటి నుంచి 16 ఏళ్ల వయసు వచ్చే వరకూ 27 డోసుల వ్యాక్సినేషన్‌ను డిజిటల్‌గా పర్యవేక్షిస్తున్నారు. మిషన్ ఇంద్రధనుస్సులో ఏపీ అగ్రగామిగా నిలిచిందని, ఇందుకు కృషి చేసిన వారికి అభినందనలు తెలిపారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ హైపర్‌టెన్షన్, డయాబెటిస్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల కోసం పెద్దఎత్తున స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు.

దేశంలో వైద్యం కోసం ప్రజలు తమ సొంత జేబు నుంచి వెచ్చించే ఖర్చు 2014-15 నాటికి 62% ఉండగా, అది ఇప్పుడు 43.4 శాతానికి పడిపోయిందని అన్నారు. కేవలం 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 23 ఎయిమ్స్ సంస్థలు రాగా, మంగళగిరి ఎయిమ్స్ 960 పడకలతో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోంది. సిద్ధార్థ, అనంతపురం వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ బ్లాకుల కోసం రూ.300 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు.

## డీఎస్సీ నియామకాల్లో ప్రభుత్వం అర్హతకు పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

ఆయన సెమీఫైనల్ పోరాటానికి సంబంధించిన వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించే ప్రచారాన్ని జగన్ ఇప్పటికైనా ఆపాలని హితవు పలికారు. అసలు వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసేలా పెద్ద అప్పలరాజుపై ఫేక్ ప్రచారం అసలు వాస్తవం పేరుతో లోకేశ్ ఎక్స్ వేదికగా వీడియోను రిలీజ్ చేశారు.

మరోవైపు మంత్రి నారా లోకేశ్‌ను విమర్శించే స్థాయి కొడాలి నానికి లేదని మంత్రి వాసంశెట్టి సుభాశ్? విమర్శించారు. 7వ తరగతి కూడా పాస్ కాని నానికి విద్యారంగం, డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వచ్చే దమ్ము వైఎస్సార్సీపీ నేతలకు లేదని ఆక్షేపించారు. 11 సీట్లకు ఘోరంగా పడిపోయినా జగన్?కు ఇంకా బుద్ధి రాలేదని, కొడాలి నాని లాంటి నేతల వల్లే ఆ పార్టీ ఘోర పరాజయం పాలైందని పేర్కొన్నారు.

## వినాయక చవితికి కిటకిటలాడుతున్న మార్కెట్లు



వినాయక చవితి అంటేనే పెద్ద పండుగ. నెల రోజుల ముందు నుంచే సందడి నెలకొంటుంది. ఈ నెల 14న జరగబోయే ఈ పర్వదినం కోసం విభిన్న రకాల వినాయక విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. పందిళ్లు, వీధులు, బహుళ అంతస్తు భవనాల్లోనూ ఉత్సవాల సన్నాహాలు జోరందుకున్నాయి. పర్యావరణహితం కోసం మట్టి విఘ్నేశ్వరుడ్నే పూజించాలన్న ఆసక్తి ప్రజల్లో పెరుగుతోంది. గణేశ్ ఉత్సవాలపై మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనిత సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**కొనుగోలుదారులతో కిటకిట**

వినాయక చవితి సందర్భంగా మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. చవితి వేడుకలకు ఒకరోజే సమయం ఉండడంతో మార్కెట్లకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావడం వల్ల సందడి వాతావరణం నెలకొంది. గతంతో పోలిస్తే పూజా సామగ్రి ధరలు మరింత పెరిగాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అలాగే గణేశుని మట్టి బొమ్మలు సైజును బట్టి రూ.30 నుంచి రూ.200 మధ్య ధరల్లో అమ్ముతున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు.

**కొనుగోళ్లు పెరగడంతో**

వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి, మోదకాలు, పండ్లు, పువ్వుల అమ్మకాలు పెరగడంతో చిన్న, మధ్య తరహా వ్యాపారుల్లో ఆశావాదం నిండింది. గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు మెరుగ్గా ఉన్నాయి. “వినాయకుడు వచ్చి మా వ్యాపారాలకు కూడా శుభం కలిగిస్తాడని నమ్మకంగా ఉన్నాం” అని వ్యాపారులు ఆనందంగా చెబుతున్నారు. పండుగ సమయంలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్లలో సందడి నెలకొంది.

**ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్**

గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. రాష్ట్రంలోని జిల్లాల ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాలు, ఊరేగింపులకు అనుమతులపై సుదీర్ఘంగా చర్చించారు. అనుమతుల కోసం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మండపాలు, ఊరేగింపుల విషయంలో నిబంధనలను ప్రజలకు వివరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిన్న సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన శాంతి భద్రతల సమీక్షలోని అంశాలపై కూడా ఎస్పీలతో చర్చించిన అనిత శాంతి భద్రతల పరిరక్షణలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.

**అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు**

వినాయక చవితి సందర్భంగా ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. పండుగ రద్దీ దృష్ట్యా ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అధిక ఛార్జీల వసూళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులను దోపిడీ చేస్తే సహించేది లేదని స్పష్టం చేసిన మంత్రి, వాహనాలు 80 కిలోమీటర్ల వేగం దాటకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించే బస్సులను సీజ్ చేయాలని ఆదేశించారు. అధిక ఛార్జీలు వసూలు చేసే ప్రైవేట్ బస్సులపై ప్రయాణికులు వెంటనే ఫిర్యాదు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.

**ముఖ్యమైన జాగ్రత్తలు**

వినాయక చవితి పండగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, ప్రజా భద్రత కోసం కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నీటి కాలుష్యానికి దారితీస్తాయి. విసర్జన సమయంలో కృత్రిమ చెరువులు లేదా అధికారులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే చేయాలని సూచిస్తున్నారు. విద్యుత్ దీపాలు, డెకరేషన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. శబ్ద కాలుష్యం నివారించి, లౌడ్ స్పీకర్లను నిర్ణీత సమయాల్లోనే ఉపయోగించాలి. పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ జాగ్రత్తలు పాటిస్తే పండగ ఆనందంగా, సురక్షితంగా జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# మలేరియా డెంగీ నివారణకు ముందడుగు

## రేపాక కాలనీలో క్రిమిసంహారక దోమతెరల పంపిణీ





**కూనవరం, సెప్టెంబర్ 12 : ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కలెక్టర్, చింతూరు ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు మలేరియా, డెంగీ వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ఆరోగ్యశాఖ చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కూటూరు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసమూర్తి దొర ఆధ్వర్యంలో కూనవరం మండలం పెదర్కూరు సచివాలయం పరిధిలోని రేపాక కాలనీ గ్రామంలో క్రిమిసంహారక దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో తొలి విడత దోమతెరల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రెండో విడత కార్యక్రమంలో భాగంగా రేపాక కాలనీ గ్రామ ప్రజలకు దోమతెరలను పంపిణీ చేసి, మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక పెద్దలు, కూనవరం మండల కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీఓబీ లక్ష్మీ, వీఓఏ కన్నారావు, గ్రామ పెద్ద చిన్నబ్బి, ఆరోగ్య సిబ్బంది హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ అర్జున్, ఆశా వర్కర్ కుమారితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. దోమల నివారణతోనే ప్రాణాంతక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని, ప్రతి కుటుంబం దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని ఆరోగ్యశాఖ సిబ్బంది సూచించారు.

## 28న చలో కడప కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**సీపీఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి పెద్దులపల్లి బాలు పిలుపు**




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** సెప్టెంబర్ 28న కడపలో నిర్వహించనున్న 'చలో కడప' భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి పెద్దులపల్లి బాలు పిలుపునిచ్చారు. శనివారం బద్వేల్‌లోని సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు కడప నగరంలో సీపీఐ రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్ర నాయకులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్లీనరీలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, కార్మికులు--రైతుల సమస్యలు, యువతకు ఉపాధి, సంక్షేమ రంగాల పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 28న 'చలో కడప' పేరుతో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభకు బద్వేల్ పట్టణం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై సీపీఐ కొనసాగిస్తున్న ఉద్యమాల్లో భాగంగా కడపలో జరిగే రాష్ట్రస్థాయి ప్లీనరీని విజయవంతం చేయడం ద్వారా 'బద్లావ్ జెరూరీ హై' నినాదాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని చలో కడప ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని బాలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి పి. నాగరాజు, జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ, జి.ఎల్. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## 4కోట్ల 23 లక్షల రూపాయలతో బీటి రోడ్డు కు భూమి పూజ చేసిన : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు ఆలూరు రోడ్డు నుండి బంటనహాల్ వరకు 4కోట్ల 23 లక్షల రూపాయలతో బీటీ రోడ్డుకు గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మరియు ఎమ్మెల్యే సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు, అల్లూరు నుండి బంటనహాల్ వరకు 4 కోట్ల 23 లక్షల రూపాయలతో బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది అని అదేవిధంగా నియోజక వర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని ఇకముందు కూడా చేపట్టి విజయవం తంగా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మండల మరియు పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చేయూత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయునిగా కత్తుల వీర్రాజు మాస్టరు



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) సెప్టెంబర్:12** రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన కత్తులు వీర్రాజు మాస్టారు పెంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుని చేయూత చారిటబుల్ ట్రస్ట్ వారు కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమూడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ ఆర్ జె డి నాగమణి ,చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మొండి రవికుమార్ తదితరులు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రంప ఎర్రంపాలెం గ్రామ పెద్దలు వీర్రాజు మాస్టారుని అభినందించారు.

## తోపుదుర్తి భాస్కర్ రెడ్డికి నివాళులర్పించిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి

**సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** వైయస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, స్వర్గీయ తోపుదుర్తి భాస్కర్ రెడ్డి గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా తోపుదుర్తి గ్రామం, భాస్కర్ రెడ్డి గారి తోట నందు ఘాట్ వద్ద తోపుదుర్తి కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి ఉరవకొండ నియోజకవర్గం పీఏసీ మెంబెర్ వై విశ్వేశ్వర రెడ్డి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే ఉరవకొండ ఇంచార్జ్ అలాగే బెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కెవి సిపి వీరన్న నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తోపుదుర్తి కుటుంబ సభ్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**మున్సిపల్ కమిషనర్ యం. కృష్ణ**




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)** వినాయక చవితి సందర్భంగా బద్వేల్ పట్టణ ప్రజలు పర్యావరణహితంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజించాలని మున్సిపల్ కమిషనర్ యం. కృష్ణ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలకు దూరంగా ఉండాలని సూచించారు. మట్టి వినాయక ప్రతిమలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో జల వనరుల కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని ఆయన తెలిపారు. చెరువులు, కాలువలు, ఇతర జల వనరులను కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బద్వేల్ పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని కమిషనర్ కోరారు. "మట్టి గణపయ్యనే పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం" అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వర్షం కోసం గ్రామ దేవతలకు పూజలు



**దువ్వూరు,సెప్టెంబర్12 ( ప్రజా జ్యోతి )** మండల పరిధిలోని చిన్న సింగన పల్లె లోని గ్రామ దేవతలకు 108 బిందెలతో అభిషేకం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. భక్తులు శనివారం పెద్దమ్మ తల్లి, అంకాలమ్మ తల్లి, శ్రీ సీత రామ లక్ష్మణ స్వాములకు,ఆంజనేయస్వామి,నాగుల కు, దస్తగిరి స్వామి, పెద్ద పీరయ్య స్వాము లకు 108 బిందెల నీటితో అభిషేకం చేసి వర్షం కోసం గ్రామంలోని అందరూ కలిసిపూజలు చేశారు.వర్షాకాలం వచ్చి మూడు నెలలు దాటుతున్న ఇంతవరకు పదును వర్షం కూడా కురవలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ దేవతలు ఒక దేవతకు 108 బిందెలనీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. దేవతలు కనికరించి ఇప్పుడైనా వర్షం కురిపిస్తారని గ్రామ ప్రజలు నమ్మకం. అలాగే ప్రతి వినాయక చవితికి పండుగ ముందుగానే పండగ లోపల గాని వర్షాలు వస్తాయని ప్రజల నమ్మకం. సోమవారం లోపల వినాయక చవితి పండుగ సందర్భంగా పూర్తిస్థాయిలో వర్షం వస్తుందని గ్రామస్తులు నమ్ముతున్నారు.

## రాజమన్నార్ అలంకరణలో ఆలమూరు శ్రీ జనార్ధన స్వామివారు.పులకించిన భక్తజనం.





**ఆలమూరు సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి):** ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామివారి ఆలయంలో భాద్రపద మాసం తొలిరోజు అయిన శనివారం నాడు స్వామివారు ఉభయదేవేరులతో కల్సి రాజమన్నార్ అలంకరణలో దర్శనం ఇచ్చారు. పట్టు తలపాగా, పట్టు వస్త్రాలు ధరించిన స్వామి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణల భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన భక్తులు తాకాసి ఏసు సహకారంతో ఆలయంలో అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. వాడపల్లి నుంచి పలువురు ఆలయానికి సేవ నిమిత్తం తరలివచ్చి భక్తులకు సేవలు అందించారు.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతి వద్దు - మట్టి గణపతియే ముద్దు : విశ్వ హిందూ పరిషత్



**జీలుగుమిల్లి : 12 సెప్టెంబర్ జీలుగుమిల్లి : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దర్భగుడెం గ్రామంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేశారు,పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా వినాయక చవితి సంప్రదాయాన్ని కొనసాగించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన మట్టి గణపతినే ప్రతిష్ఠించి, పండుగ అనంతరం సహజ పద్ధతుల్లో నిమజ్జనం చేయాలని కోరారు. "మట్టి గణపతి పర్యావరణానికి మేలు, మన భవిష్యత్తుకు భద్రత" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరి చందు, పైడిమర్ల రాజశేఖర్ రెడ్డి, కొనకళ్ళ మధు, పై రెడ్డి మధు, పైడిమర్ల యశ్వంత్, దేశెట్టి హరీష్ ఆర్ ఎస్ ఎస్ వేదుల జనార్ధనరావు,పరిషత్ సభ్యులు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

## ఆలమూరు శ్రీ జనార్ధన స్వామివారిని దర్శించుకున్న ఆలమూరు సివిల్ కోర్టు జడ్జి ఐ ప్రవీణ్ కుమార్ సతీమణి పూజిత.



**ఆలమూరు సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి):** నారద ప్రతిష్టిత నవ జనార్దన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారిని శనివారం ఆలమూరు సివిల్ కోర్టు జడ్జి ఐ ప్రవీణ్ కుమార్ సతీమణి పూజిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అర్చకులు, చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం శేష వస్త్రాన్ని అందించి సత్కరించారు. ఆలయంలో జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సైతం స్వయంగా పాల్గొని భక్తులకు ఆమె అన్నప్రసాదాన్ని వడ్డించారు.

## రంగాపురంలో ఎంపీటీసీ ఓటర్ల జాబితా ప్రదర్శన : పంచాయతీ డెవలప్మెంట్ అధికారి సుధీర్ నందకుమార్



**బేతంచెర్ల:సెప్టెంబర్12(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని ఆర్.ఎస్. రంగాపురం గ్రామానికి సంబంధించిన రెండు ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాను పంచాయతీ డెవలప్మెంట్ అధికారి డి. సుధీర్ నందకుమార్ విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఓటర్ల జాబితాను రూపొందించి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ డెవలప్మెంట్ అధికారి సుధీర్ నందకుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని ఓటర్లు ఓటర్ల జాబితాలో తమ పేర్లు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో గ్రామపంచాయతీ కార్యాలయంలో పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## రైతన్నలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** మండలంలో ని సంగాల గ్రామం నందు కాలవలను శుభ్రం చేయుట కొరకు ఇబ్బంది పడుతున్న రైతన్నలకు శనివారం గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ని మరియు ఆయన సోదరుడు గుంతకల్లు మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి ని మర్యాదపూర్వ కంగా కలిసి కాలువలో ముళ్లపొదలు శుభ్రం చేయాలని రైతులు తెలియజేయడం జరిగింది. స్పందించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తక్షణమే రైతన్నలకు రెండు లక్షల 50 వేల రూపాయలు అందించి రైతన్నలకు అండ గా నిలిచారు. ఈ సందర్భంగా సంఘాల గ్రామ రైతులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి మరియు గుమ్మనూరు నారాయణ స్వామికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసి మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేము అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘాల గ్రామ రైతన్నలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు



**బేతంచెర్ల:సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)** పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టా రాజేష్ సూచించారు. మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని దాతలు దారా మోహన్, మురళీమోహన్ సహకారంతో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టా రాజేష్ మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కోరారు.

## 1980ం ఫొటో ట్రెండ్'పై సైబర్ మోసాలతో జాగ్రత్త:

**గోకవరం ఎస్సై పవన్ కుమార్**



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) సెప్టెంబర్ 12:** 1980ల ఫొటో ట్రెండ్ ను ఆసరాగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు నకిలీ యాప్లు, అనుమానాస్పద లింకులను ప్రచారం చేస్తున్నారని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. ఇదే అదునుగా చూసుకొని '1980ం' పేరుతో ఏపీకే ఫైల్స్, లింకులు పంపుతూ నెటిజన్లను మోసం చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ట్రెండ్ కోసం తెలియని యాప్లను డౌన్లోడ్ చేయవద్దని, యాప్లను కేవలం అధికారిక యాప్ స్టోర్ల నుంచే వినియోగించాలని సూచించారు.

## గొడ్డలి పార్టీ రాష్ట్రాన్నే కాదు పాలకొల్లును విధ్వంసం చేసింది

### మంత్రి నిమ్మల రామానాయుడు.




**పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 12.** ఐదేళ్లపాటు పాలన చేసి రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన గొడ్డలి పార్టీ పాలకొల్లులోనూ అభివృద్ధి కి బదులు విధ్వంసం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు నందు శనివారం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు.ఆయా ప్రాంతాలలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు, ఉద్యోగులు అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వ పరమైన సేవలందించాలని సూచించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన గొడ్డలి పార్టీ పాలకొల్లునూ అభివృద్ధి చెయ్యకుండా విధ్వంసం చేసిందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లులో దమయ్యపర్తి డ్రైన్ పనులను చేపట్టగా అడ్డుకున్న గొడ్డలి పార్టీ, అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ 16 కోట్లు వెచ్చించి పూర్తి చేశామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రి భవననికి రూ. 12 కోట్లు తీసుకువస్తే, గొడ్డలి ప్రభుత్వం లో నిర్మాణం చేసిన భవనం ప్రారంభానికి నోచుకోక ముందే మరమ్మత్తుల పాలయ్యిందన్నారు. గొడ్డలి పార్టీ నాయకులు అధికారం ఉన్నప్పుడు స్వలాభం కోసం పదవులు అనుభవించారే గాని అభివృద్ధి ప్రజల గురించి పట్టించుకోలేదు. పేరు కోసమో సంపాదన కోసమో స్వలాభం కోసమో రాజకీయాల్లో ఉంటే ప్రజలు హర్షించరని తమని ఎన్నుకున్న ప్రజలకు సేవ చేస్తేనే హర్షించి తిరిగి అధికారం ఇస్తారని అన్నారు అధికారంలో ఉన్నప్పుడు విద్వంస పాలన సాగించిన గొడ్డలి పార్టీకి రాజకీయాల్లో ఉండే అర్హత లేదన్నారు. గొడ్డలి పార్టీ ఐదేళ్లు ధ్వంసం, విధ్వంసంతో పాలన సాగించగా, నేడు కూటమి ప్రభుత్వం వికాసం వైపు పరుగులు పెడుతుందన్నారు తనకు మూడుసార్లు విజయం చేకూర్చిన ప్రజల రుణం తీర్చుకునే విధంగా పాలకొల్లు నియోజకవర్గం ను అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలపటానికి అహర్నిశలు శ్రమిస్తున్నానని రామనాయుడు తెలిపారు. కూటమీ ప్రభుత్వ రెండేళ్లపాలన లో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో అన్ని శాఖల నుండి కోట్లాది రూపాయలు నిధులను తీసుకువచ్చానన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రిగా రైతులకు మేలు జరిగేలా కోట్లాది రూపాయలతో కాలువలు అభివృద్ధి పనులతో పాటు పుంత రోడ్లను నిర్మాణం చేసామన్నారు. పాలకొల్లు నియోజకవర్గం లో అర్ అండ్ బి, జల జీవన్, ఆరోగ్య శాఖ, విద్యుత్ తదితర శాఖల పరంగా చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి నిమ్మల వివరించారు. పాలకొల్లు పట్నం లోను, పరిసర గ్రామాల ప్రధాన కూడళ్ళ లోను దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు సి యస్ అర్ నిధులు పొంది స్మశానవాటిక ల అభివృద్ధి, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ చేస్తున్నామన్నారు.కూటమి ప్రభుత్వం పనిచేసే మంచి కూటమి ప్రభుత్వాన్ని, నాయకులను ప్రజలు ఆశీర్వదించి అండగా నిలవాలని మంత్రి నిమ్మల కోరారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకులు, బీజేపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో మార్స్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### --సీఐ సూర్య అప్పారావు,ఎస్ఐ రామలింగేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ

### --రంగు వినాయక విగ్రహాలు వద్దు.. మట్టి వినాయక విగ్రహాలు ముద్దు-సీఐ బి ఎస్ అప్పారావు



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం పట్టణంలో మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూర్య అప్పారావు,ఏలేశ్వరం ఎస్సై రామలింగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మార్స్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో 1008 మట్టి వినాయక విగ్రహాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఐ బి సూర్య అప్పారావు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావును అభినందించారు.ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు."రంగు వినాయక విగ్రహాలు వద్దు.. మట్టి వినాయక విగ్రహాలు ముద్దు" అని తెలిపారు.వినాయక చవితి ఉత్సవాల్లో ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రయాగమూర్తి ప్రగడ,కోరాడ శ్రీనివాస్, అలంకారం టైలర్ రాజు, శివాజీ మాస్టారు, నల్లమిల్లి కృష్ణబాబు, జి సత్యనారాయణ,కటకం కిరీటి, ఉడతల రమణారావు, బుర్రి యశ్వంత్,వాగు సూర్యకుమారి, విజయ పెన్నాడ మానస, ప్రియాంక, బ్లెస్సీ, మంజుల అనంతలక్ష్మి, అరుణ, గోళ్ల విజయ్, సతీష్, వాగు సాయి, లక్కీ,అఖిల్,గంప చరణ్, మార్స్ కంప్యూటర్స్ విద్యార్థులు, పలువురు భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య సేవలు






**ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యం: ట్రస్ట్ అధ్యక్షులు నారాయణ నాయక్**



**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించు కొని, "మీ ఆరోగ్యం... మా సేవ!" నినాదంతో నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రశాంతి నగర్ లో రిటైర్డ్ హెడ్ మాస్టర్ చంద్రకళ ఇంటికి సమీపంలో శనివారం ఉదయం 6:30 గంటల నుంచి ఉచిత వైద్య ఆరోగ్య సేవల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు వైద్యులు అందుబాటులోకి వచ్చేలో పు బాధితులకు అందించే తక్షణ సహాయాన్ని ప్రథమ చికిత్స అంటారు. సరైన సమయంలో, సమయస్ఫూ ర్తితో అందించే ప్రథమ చికిత్స ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరిగినప్పుడు భయాందో ళనకు గురికాకుండా ప్రశాంతంగా స్పందించి, బాధితుడికి సకాలంలో ప్రథమ చికిత్స అందించడం ప్రతి బాధ్యతాయుత పౌరుడి సామాజిక బాధ్యత అని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య ఆరోగ్య సేవలను అందించారు. ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందు బాటులో ఉండేలా నారాయణ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోం దని, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నారాయణ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నారాయణ నాయక్, ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న కమిటీ సభ్య లు డాక్టర్ రాఘవేంద్ర రావు ఎంబీబీఎస్, జిఎం చలపతి, నారాయణస్వామి, చంద్రకళ, శంకర్ నాయక్, దస్తగిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ సీతారాం ఎంచూరి వర్ధంతి



**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి ):** స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయం లో కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు. మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి తమిళనాడులో 12-8-1952 లో జన్మించా రు.12-9-2024 న ఆనారోగ్యంతో మరణించా రునీ అన్నారు ఆయన భౌతికంగా మన మధ్యలో లేకపోయినా ఆయన పోరాట స్ఫూర్తి, ఆయన త్యాగాలు పార్టీని బలోపేతం చేయడంలో చేసిన కృషి మాటల్లో చెప్పలేమన్నారు. ఆయన చిన్న వయసు నుండి కమ్యూనిస్టు సిద్ధాంతాలు నచ్చి విద్యార్థి దశ నుండి విద్యార్థి నాయకుడిగా ఆ రంగానికి ఎన్నో సేవలు చేశారు అలాగే ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా. సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పొలిట్ బ్యూరో సభ్యుడుగా దేశానికి సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నో సేవలు అందించారు. రైతులకు, కార్మికులకు, పేద ప్రజలకు పార్టీ నాయకత్వానికి ఆయన లేని లోటు చాలా బాధాకరం అన్నారు అలాగే కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ మతతత్వ రాజకీయాలు చేస్తూ హిందూ, ముస్లిం, క్రైస్తవులు పేరుతో అన్నదమ్ముల్లా ఉన్న వారిని మతం పేరుతో కులం పేరుతో బిజెపి పార్టీ అధికారం లోకి రావడానికి విభజించు పాలించు అనే పద్ధతిని ఆసరిస్తా ఉంది కావున భవిష్యత్తులో సిపిఎం పార్టీ, విద్యార్థి రంగం, యువజన రంగం, కార్మిక రంగం, సామాజిక రంగం, రైతాంగం చేసే పోరాటాలలో ప్రజలందరూ భాగస్వాములు అయినప్పు డే ఆయనకు ఘనమైన నివాళు లు అర్పించడం అవుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు అబ్దుల్లా, షాష, రామునాయక్, షబ్బీర్, తిమ్మప్ప, ఎస్ఎఫ్ఐ వెంకటేష్, నరేష్ చందు. మహిళా సంఘం నాయకురాలు ప్రమీల, పూర్ణిమ, శాఖ కార్యదర్శిలు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక దోపిడీ అక్రమ రవాణాపై ప్రత్యేక పోలీసు బృందం ఆరా.

**అనంతగిరి మండలం. సెప్టెంబర్ 12. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. కాశీపట్నం. చిలకల గెడ్డ పంచాయితీల పరిధి గిరిజన గ్రామాల గోస్తాని నదీ జలాల నుండి మైదాన ప్రాంత వ్యాపారులు అక్రమంగా ఇసుక దోపిడీ.రవాణా జరుపుతూ అత్యధిక ధరలకు ఇసుకను అమ్మకాలు జరుపుతున్నారని దీంతో మండల ప్రజలకు నిర్మాణాల అవసరం నిమిత్తం ఇసుక లభించడం లేదని ఇటీవల కాలంలో వివిధ పత్రికల్లో వార్తలు వెలువడడంతో ప్రత్యేక పోలీసు బృందం ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.


## మొసలిపై దాడి ఘటనలో ముగ్గురి అరెస్ట్




**నందవరం,సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలో ని నాగులదిన్నె బ్రిడ్జి సమీపంలోని తుంగభద్ర నదిలో ముసలి పై దాడి చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి తెలిపారు. ఈ నేల 2న జరిగిన ఘటనలో బోయ రామాంజనేయులు, బోయ తిక్కయ్య బోయ రామగోవిందును అరెస్ట్ చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. వన్యప్రాణు లకు హాని చేయొద్దన్నారు. వాటి సంచారంపై సమాచారం ఉంటే అటవీశాఖకు తెలియజేయాలని కోరారు.

## బాపట్ల అభివృద్ధిపై ప్రజలే నిర్ణయిస్తారు

**రూ 800 కోట్లకు పైగా పెట్టుబడులు రూ.66 కోట్లతో డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు**



**బాపట్ల, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)** బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారా నికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. గత ఐదేళ్ల పాలన, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలే బేరీజు వేసుకోవాలని అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. మురుకొండపాడులో సాగునీటి ఇబ్బందులను గుర్తించి సుమారు రూ.3.50 లక్షల సొంత నిధులతో కాలువ పనులు చేయించినట్లు చెప్పారు. రైతులు, పేదలు విద్యార్థులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన సహకారం అందిస్తున్నానన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బాపట్ల నియోజకవర్గంలో రూ.800 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పర్యాటక రంగంలో స్టార్ హోటళ్లు, లెమన్ ట్రీ, ఐటీసీ, హిల్టన్ వంటి సంస్థల ప్రాజెక్టులు రానున్నాయని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.బాపట్ల పట్టణ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సుమారు రూ.66 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, సెప్టెంబర్‌లో టెండర్లు పిలిచే అవకాశం ఉందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అదనపు ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. కర్లపాలెం,పులుగువారిపాలెం, యత్రువారి పాలెం, చందోలు,పొన్నూరు రహదారి పనులు పూర్తయ్యాయని, మూడు వంతెనల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సూర్యలంకలో బోటింగ్, స్పీడ్‌బోట్లు, ఫ్యామిలీ బోట్ల ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వైసీపీ పాలనలో బాపట్లలో అవినీతికి తావిచ్చే విధంగా పాలన సాగిందని విమర్శించిన నరేంద్రవర్మ. ప్రస్తుతం పారదర్శక పాలన అందిస్తున్నామని అన్నారు. అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని, ప్రజలే నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.

# దానాలలో కెల్లా అన్నదానం గొప్పది

**: శ్రీలక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం అలయ ధర్మకర్త తలారి.తేజ**

**ప్రతి సంవత్సరం అన్నదానం చేస్తున్న చైతన్య వర్ధిని రామాంజనేయులు కుటుంబ సభ్యులు**

**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** శ్రీశ్రీ శ్రీలక్ష్మీనా రాయణ స్వామి రాతి దేవస్థానం అలయ వ్యవస్థాపకులు తలారి శకుంతలమ్మ ఆలయ ధర్మకర్త తలారి. తేజ లక్ష్మీనారాయణ స్వామి వారి దేవస్థానం శనివారం సందర్భంగా ప్రాత:కాలమే అర్చక స్వాములు స్వామివారికి అలంకరణ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తాదులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి నిత్యాన్న ప్రసాద వితరణ ఆలయ ధర్మకర్త తలారితేజ మాట్లాడుతూ శనివారం రోజుకి నిత్యాన్నదానం 1321రోజు అయినందుకు ఆనందిస్తూ గుంతకల్లు వాస్తవ్యులైన భాగ్యనగర్ కు చెందిన చైతన్యవర్ధని రామాంజనేయులు వారి కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం చేయిస్తున్నారు. వీరికి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆశీస్సులు ఉండాలని అన్ని,



దానాల్లోకె ల్లా అన్నదానం చాలా గొప్పది. మనం ఏ దానం చేసిన ఇంత ఫలితాన్ని ఇవ్వదు ఒక అన్నదానం చేస్తేనే కోటి యజ్ఞలు చేసిన ఫలితం ఇస్తుంధని వేదాలు పురాణాలు చెప్పాయి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ వ్యవస్థా పకులు శకుంతలమ్మ, ధర్మకర్త తలారి తేజ, చైతన్య వర్ధిని రామాంజనేయులు వారి కుటుంబ సభ్యులు అన్నదాన అన్న దాన సిబ్బంది దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాహంతో అల్లాడుతున్న సూరయ్యపేట చుక్క నీరు లేక బిందెడు నీటి కోసం బతుకు పోరాటం

**.ఓట్లు కావాలి.. నీళ్లు వద్దా? నాయకుల తీరుపై మండిపడుతున్న మహిళలు**

**తాళ్లపూడి,సెప్టెంబర్ 12, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం, అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని సూరయ్యపేట గ్రామంలో తాగునీటి కష్టాలు తారాస్థాయికి చేరాయి. కొన్నాళ్లుగా చుక్క నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గొంతు తడుపుకోవడానికే నానా కష్టాలు పడుతున్నామని గ్రామ మహిళలు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎన్నికల ముందు ప్రతి ఇంటికి తిరిగి ప్రతి గడప తొక్కి నీరు ఇస్తాం రోడ్లు వేస్తాం అభివృద్ధి చేస్తాం అంటూ చేతులు జోడించి ఓట్లు దండుకున్న స్థానిక రాజకీయ నాయకులు ఇప్పుడు అదే సూరయ్యపేట ప్రజలు దాహంతో అల్లాడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఒక్కసారి సూరయ్యపేట వైపు కన్నెత్తి చూడండయ్యా అంటూ ముక్తకంఠంతో మొత్తుకుంటున్నారు. పంచాయతీ అధికారుల తీరు మరింత దారుణంగా ఉందని ఆరోపిస్తున్నారు. రెండు రోజులకోసారి నామమాత్రంగా ఒక్క ట్యాంకర్ పంపి చేతులు దులుపుకుంటు న్నారని ఆ ఒక్క ట్యాంకర్ కోసం ఆడవాళ్లు, వృద్ధులు, చిన్న పిల్లలుబారులు తీరి బిందెడు నీళ్లు నింపుకోవడం కోసం తోపులాటలో కిందపడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తాగునీరు లేక పిల్లలకు స్నానాలు కూడా చేయించలేకపోతు న్నామని వాపోతున్నారు. తక్షణమే ఎమ్మెల్యే స్పందించి సూరయ్యపేటకు శాశ్వత తాగునీటి పరిష్కారం చూపించాలని



తాత్కాలిక ట్యాంకర్లతో కాలం వెళ్లదీయకుండా పైప్ లైన్ ద్వారా ప్రతి ఇంటికి నీరు అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# గుంతకల్లు పట్టణానికి విచ్చేసిన శ్రీశైల జగద్గురు పీఠాధిపతి



**పూర్ణకుంభం కలిశాలతో, గోరవయ్యలనృత్యంతో భక్తులు ఘన స్వాగతం**

**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** శనివారం గుంతకల్లు పట్టణానికి శ్రీశ్రీశ్రీ 1008 శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్దరామ పండితారాధ్య శివాచార్య మహాస్వాముల వారు ఇటీవల కైలాస పర్వతం, మానస సరోవరం యాత్ర పూర్తి చేసుకుని, శ్రీశైల మహా క్షేత్రంలో శ్రావణ మాస పూజలు, ఇష్టలింగ పూజ అనుష్ఠానం చేసి గుంతకల్లు పట్టణానికి విచ్చేసి పట్టణం లోని గుంతకల్లు బీరప్ప గుడిలో పూజాలు నిర్వహించారు. అనంతరం పూర్ణకుంభం కలిశాలతో శ్రీ భక్త కనకదాసుకు పూలమాలవేసి బీరప్ప డొల్లులతో గోరవయ్యల నృత్యం, వీరభద్ర నృత్యంతో బాణాసంచారం శ్రీశైల జగద్గురు పీఠాధిపతి రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున్న ఈ యాత్రలో పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమములో పూజారి బసప్ప,పూజారి లింగప్ప, గుంతకల్లు నియోజకవర్గ కురువ సంఘం అధ్యక్షుడు కే సోమశేఖర్, లింగన్న గౌడ్, ఎంఆర్ఎఫ్ మల్లికార్జున, మందలప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామప్ప, నీలకంఠ, కడియాల శివ, ఎల్ఐసి నారాయణ, లక్ష్మీ బాబు, బండయ్య, మధు, అనిల్, తిమ్మప్ప, ఎం.కె. సురేష్, మాసునూరు నగేష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో పార్టీని గుండెల్లో పెట్టుకుని కాపాడిన సీనియర్ కార్యకర్తలను కలవడం,వారి యోగక్షేమాలు తెలుసుకోవడం నా పూర్వజన్మ సుకృతం..

**కౌతాళం మండలం అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు**





**కౌతాళం, సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి** నిన్న టి రోజున మంత్రాల యం నియోజకవర్గం కౌతాళం మండలం కుంబళనూరు క్యాం పు-1 గ్రామం నందు సీనియర్ ముఖ్య నాయకులు నేమాని సత్యనారాయణ మూర్తి గారు గత కొద్ది రోజు లుగా కిందట ప్రమాద వశాత్తు క్రింద పడి సర్జరీ చేసుకొని తిరిగి స్వగ్రామం వచ్చిన విష యం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్ళి పెద్దాయన ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసు కొని ధైర్యంగా ఉండి మాలాంటి యువ నాయకత్వానికి మార్గదర్శిగా ఉంటూ ప్రజాసేవ చెయ్యడానికి ఆ భగవంతుడు మీకు త్వరగతిన పూర్తిగా కోలుకునే శక్తి మీకు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తూ,ఎన్నికలప్పుడు మాత్రమే కాదు,ఎల్లప్పుడూ మీ కుటుంబంలో ఒకడిగా నేను ఉంటాను,మీ ఆశీస్సులు ఆత్మీయత నాకు కొండంత బలం అని వారి కుటుంబానికి తెలియజేశారు.ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు పట్టాభి,లక్కే గోవిందు, మహాదేవ,నాగరాజు మొదలగు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది

## నారాయణ మెడికల్ అకాడమీ కళాశాల కళాశాల స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు




**కర్నూలు సెప్టెంబర్ 12( ప్రజా జ్యోతి న్యూస్)** స్టాఫ్ రిపోర్టర్ కర్నూల్ నగరంలోని నారాయణ మెడికల్ అకాడమీ కళాశాల వార్షికోత్సవం.స్వాగతోత్సవ వేడుకలు స్థానిక రావూర్ గార్డెన్ నందు అత్యంత వైభవోపేతంగా నిర్వహించినట్లు డీన్ ఆంజనేయ రెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా నారాయణ కళాశాలల కోర్ డీన్ లింగేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డీన్ ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ 2002 లో స్థాపించడం జరిగిందని, మెడికల్ శిక్షణకు అత్యుత్తమ కేంద్ర బిందువుగా మారిందన్నారు. ప్రతి సంవత్సరం ఫలితాల్లో తమ విద్యార్థులు సాధించిన రికార్డులను చెరిపేస్తూ ఎంబిబిఎస్ సీట్లు సాధనలో దోహద పడుతుందన్నారు. కర్నూలులో స్థాపించిన నాటి నుండి నేటి వరకు రెండు వేలకు పైగా ఎంబిబిఎస్ సీట్లు సాధించడం జరిగిందన్నారు. గత ఏడాది 176 సీట్లు సాధించి ఆల్ టైం రికార్డ్ సృష్టించినట్లు చెప్పారు.గత ఏడాది ఆల్ టైం రికార్డును ఈ ఏడాది చెరిపేసేందుకు తమ విద్యార్థులు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫలితాలు ఏవైనా సరే అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధన లక్ష్యంగా నారాయణ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని ఆంజనేయ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. కళాశాల డీన్ సార్ ప్రిన్సిపల్ మేడం గారు లెక్చరేర్స్ అందరూ కలిసి కోర్ డీన్ లింగేశ్వర్ రెడ్డిని సార్ ని ఘనంగా సత్కరించి సన్మానించారు.

## కర్నూలు నగరంలో కోల్స్ సెంటినీయల్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో 108 వ సంఘ వార్షికోత్సవ వేడుకలు




**( ప్రజా జ్యోతి న్యూస్ ) సెప్టెంబర్ 12** స్టాఫ్ రిపోర్టర్ కర్నూలు నగరంలోని కోల్స్ సెంటినీయల్ తెలుగు బాప్టిస్ట్ సంఘము 108వ సంఘ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవోతంగా ప్రారంభించినట్లు సంఘ అధ్యక్షులు సాలమన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108వ సంఘ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆశీర్వాద అంశము ఏమిటి అంటే 70 ఏళ్ళు పైబడిన 70 మందికి పైగా పెద్దలను ఘనంగా సత్కరించి సన్మానించడం జరిగిందని చెప్పారు.సర్వాంగ సుందర రమణీయ రంజిత దేవాలయము, కర్నూలు నగరానికి తలమానికముగా రూపొందించిన దివ్య ఆలయం సంఘము స్థాపించిన డాక్టర్ జె అక్కర్ మన్ కోల్స్ దొర,డాక్టర్ విలియం ఆర్థర్ స్టాంటన్ సేవలు మరువలేనివని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.కోల్స్ దొర తల్లిదండ్రులు డాక్టర్ అబ్రహం కోల్స్.కారోలిన్ కోల్స్,సహోదరి ఏమీలి కోల్స్ లు1843 లోన్యూ జెర్సీలో జన్మించి1952లో స్వదేశంలోనే మరణించారన్నారు. అమెరికా బాప్టిస్ట్ మిషనరీ 100 సంవత్సరముల విదేశీ సేవలో ప్రత్యక్ష పరచబడిన దేవుని శక్తికి క్రీస్తు ప్రేమకు స్మృతి చిహ్నముగా ప్రతిష్టించబడిన మహిమగల దివ్య మందిరముగా వారు అభివర్ణించారు.12వ తేదీ శనివారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు ధ్యాన కూటము కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు.సంఘ వార్షికోత్సవ ఆరాధన, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 వరకు కోలాటం కొరియోగ్రఫీ, సాయంత్రం 6:30 గంటలకు సండే స్కూలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13 ఆదివారం ఉదయం 6 గంటలకు సంఘ కాపరులచే బాప్తిస్మములు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 7 నుండి 9 గంటల వరకు సండే స్కూల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంద న్నారు.ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు సంఘ ఆరాధన.సాయంత్రం 4:30 నుండి 6:30 గంటల వరకు సి సి వై ఎఫ్ కార్యక్రమాలు. సాయంత్రం 6:30 నుండి 9 వరకు సువార్త కూటము ఉంటుందని వారు పేర్కొన్నారు.

## గుంతకల్లు డిఆర్ఎం కార్యాలయంలో రైల్వే సమస్యలపై డిఆర్ఎం తో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ చర్చ



**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** డిఆర్ఎం కార్యాలయంలో శనివారం గుంతకల్లు రైల్వే డివిజన్ (డిఆర్ఎం) చంద్రశేఖర్ గుప్తాని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వే సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రివర్యులకు వినతిపత్రాలు సమర్పించిన విషయాన్ని డిఆర్ఎం దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ సమస్యలపై రైల్వే ఉన్నతాధికారులతో జరిగే సమావేశాల్లో మరోసారి ప్రత్యేకంగా ప్రస్తావించి, పెండింగ్‌లో ఉన్న సమస్య లను త్వరితగతిన పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఎంని ఎంపీ కోరారు.

## 52 పల్లెల దాహం తీర్చే దిశగా అడుగులు

**తాగునీటి పథకాల పునరుద్ధరణకు రూ 22.02 కోట్లు**



**పర్చూరు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** పర్చూరు నియోజకవర్గంలోని పల్లెల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం రూ.22.02 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆరు మండలాల్లోని 52 గ్రామాలకు ఈ నిధులతో తాగునీటి వసతులు మెరుగుపడనున్నాయి.నిధుల కొరత, సాంకేతిక ఇబ్బందులతో నిలిచిపోయిన పథకాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో రీస్ట్రక్చర్డ్ సింగిల్ విలేజ్ స్కీమ్ (ఎస్ వి ఎస్) కింద 52 గ్రామాల పథకాల పునరుద్ధరణకు నిధులు మంజూరయ్యాయి.చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి, మార్టూరు, పర్చూరు మండలాల్లోని గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టనున్నారు. పైప్‌లైన్ల పునరుద్ధరణ, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నల్లా కనెక్షన్లు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు.పథకాలు పూర్తయితే ఆయా గ్రామాల్లోని వేలాది కుటుంబాలకు తాగునీటి ఇబ్బందులు తగ్గనున్నాయి. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు.

## చెరువు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**రూ.50 లక్షలతో నూతన పథకానికి ఎమ్మెల్యే శంకుస్థాపన**



**బాపట్ల సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)**బాపట్ల మండలం చెరువు గ్రామ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా అడుగు పడింది. సుమారు 50 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న నూతన తాగునీటి పథకానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శనివారం శంకుస్థాపన చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఎ పి డి సి యల్ వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

**ఈ ఈ అచ్చుతాచారి సూచన**



**చింతూరుసెప్టెంబర్ 12ప్రజాజ్యోతి** వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయబడే వినాయక మండపాలకు ఎ పి ఈ పి పీడీసీల్ ద్వారా ఉచిత విద్యుత్ సరఫరా కల్పించబడుతుందని రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అచ్యుతచారి తెలిపారు.ఉచిత విద్యుత్ సౌకర్యం పొందదలచిన వినాయక మండప నిర్వాహకులు ఎ పిపిపీడీసీల్ ఈస్ట్రన్ పవర్ వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవలెనన్నారు. నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, శాఖ మార్గదర్శకాలు పాటించిన అర్హత మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా అందించబడుతుందన్నారు.మండప నిర్వాహకులు తాత్కాలిక వైరింగ్,విద్యుత్ పరికరాల ఏర్పాటు సమయంలో భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్ ఫార్మర్లకు సురక్షిత దూరం పాటించాలన్నారు. అనధికారిక కనెక్షన్లు తీసుకోవడం చట్ట శిక్షార్హమని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తిన యెడల వెంటనే సమీప విద్యుత్ కార్యాలయాన్ని లేదా ఎ పి ఈ పీడీసీల్ సిబ్బందిని సంప్రదించలని అన్నారు ప్రజల సహకారంతో వినాయక చవితి ఉత్సవాలు సురక్షితంగా, విజయవంతంగా నిర్వహించబడాలని ఎ పి ఈ పీడీసీల్ కోరుతున్నట్లు తెలిపారు.

## ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.ఎన్. రాజశేఖర్ పేర్కొన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, పర్యావరణహితమైన మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగిం చాలనే సందేశాన్ని విద్యార్థులు, ప్రజలకు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ.. రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఆయన సూచించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భక్తులకు, స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎమ్. సుబ్బారావు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## వల్లూరులో స్థలాల కబ్జాకు యత్నంరక్షణ కల్పించాలని అధికారులకు యజమానుల విజ్ఞప్తి



**సామర్లకోట(ప్రజా జ్యోతి)** సామర్లకోట మండలం ఉండూరు పంచాయతీ శివారు వల్లూరు గ్రామంలోని సాయి నందన లేఔట్‌లో తాము కొనుగోలు చేసిన స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థల యజమానులు ఆరోపించారు. తమ ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు సంబంధిత అధికారులను కోరారు. శనివారం వల్లూరులో బాధితులు తమ సమస్యను మీడియా ముందుంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయి నందన లేఔట్‌లోని సర్వే నంబర్లు 128/12, 128/6బి, 128/11లలో సుమారు 25 ఏళ్ల క్రితమే ఐదు వేర్వేరు డాక్యుమెంట్ల ద్వారా తాము ఈ స్థలాలను కొనుగోలు చేశామని తెలిపారు. స్థలాలకు సంబంధించిన అన్ని రకాల అసలు రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్దే భద్రంగా ఉన్నాయని, వాటిని అధికారుల పరిశీలనకు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.అయితే, ప్రస్తుతం కొందరు వ్యక్తులు స్థానిక రాజకీయ నాయకుల పేర్లను వాడుకుంటూ, తమ స్థలాల్లోకి అక్రమంగా ప్రవేశించి కబ్జాకు యత్నిస్తున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అండదండలతో చేస్తున్న ఈ అక్రమ జోక్యం వల్ల తాము తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని, తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

**కాలువపై గ్రావెల్ సమస్య**

తమ స్థలాల సమీపంలో ఉన్న ఇరిగేషన్ కాలువపై అడ్డగోలుగా గ్రావెల్ వేయడం వల్ల అటు రైతులు, ఇటు స్థల యజమానులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు వివరించారు. అధికారులు వెంటనే స్పందించి కాలువ పరిస్థితిని సమీక్షించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.తమ వద్ద ఉన్న చట్టబద్ధమైన కొనుగోలు పత్రాలు, ఇతర ఆధారాలను ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. తమ హక్కులను కాపాడటంతో పాటు, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రెంటికి చెడ్డ రేవడి'లా జాతీయ రహదారి!

**భూమి ఆంధ్రాది.. వాహనాలు తెలంగాణవి.. చావుకొచ్చిన సరిహద్దు పేచీ!**

**నాలుగేళ్లుగా గోతులమయమే.. 'మూలిగే నక్కపై తాటిపండు'లా ఇసుక మాఫియా**

**తూతూమంత్రపు ప్యాచ్‌వర్క్‌లు కుదరవు.. పూర్తిస్థాయి రోడ్డు వేసేదాకా తగ్గేదేలే**

**స్పందించకుంటే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి ఖాయం: సీపీఎం నేత ఐ.వి. గర్జన**





**ఎటపాక, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):** రాజుపేట నుంచి కన్నాయిగూడెం వరకు ధ్వంసమైన జాతీయ రహదారిని తక్షణమే పునర్నిర్మించకపోతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎం పోలవరం జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి. హెచ్చరించారు. శనివారం కన్నాయిగూడెం సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, గ్రామ ప్రజలతో కలిసి భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై బైఠాయించి ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రహదారి సమస్యపై ఐ.వి. మాట్లాడుతూ.. గత నాలుగైదేళ్లుగా ఈ జాతీయ రహదారి అధ్వానంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు అడపాదడపా తూతూమంత్రంగా చిన్నచిన్న మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. భారీ గోతులతో వాహనాలు నడపడానికే వీల్లేని స్థితిలో ఉంటే, "మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా" అధిక లోడుతో తిరుగుతున్న ఇసుక లారీలతో రోడ్డు మరింత ఛిద్రమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ఎటపాకకు వెళ్లాలన్నా, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలన్నా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన చెందారు. సరిహద్దు వివాదాల నెపంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. "రహదారి భూభాగం ఏపీలో ఉందని తెలంగాణ సర్కారు.. తిరిగే వాహనాలన్నీ తెలంగాణవేనని ఏపీ సర్కారు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఫలితంగా ఈ రహదారి రెంటికి చెడ్డ రేవడిలా మారింది" అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో ప్రభుత్వ కార్యాలయాల విధులను అడ్డుకుంటామని, నాసిరకం మరమ్మతులు చేస్తే పనులను సైతం స్తంభింపజేస్తామని హెచ్చరించారు.ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఎం ఎటపాక మండల కమిటీ సభ్యులు జి. హుస్సేన్, జె. సంపత్, బేతి మంగయ్య, మల్లెల శేషయ్య, బూరం శ్రీనివాస్, వైఎస్సార్సీపీ నాయకులు బేతి పాపారావు, చల్లా మణి, పులుసు వంశీ, దేగల నరసింహారావు, పిన్నబోయిన శ్రీనివాస్, బూరం గణపతితో పాటు కన్నాయిగూడెం గ్రామస్తులు, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన యునైటెడ్ కాపు వనిత క్లబ్.

**పాలకొల్లు. ప్రజాజ్యోతి. సెప్టెంబర్ 12.** పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ సభ్యులు శుక్రవారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వద్ద పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్తానిక సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం వద్ద 150 మంది భక్తులకు మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను, వినాయక వ్రతకల్పం పుస్తకాలను, క్లాత్ బ్యాగ్ లను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రకృతి పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ ధ్యేయంగా క్లబ్ సభ్యులు వారి చేతులతో మట్టిలో తులసి విత్తనాలు కలిపి వినాయక విగ్రహాలను తయారుచేసి పంపిణీ చేసామని ప్రెసిడెంట్ దేవరపు కాంచనమాల ట్రెజరర్ తోట గాయత్రి లు తెలిపారు. యునైటెడ్ కాపు వనిత క్లబ్ కార్యవర్గం సభ్యులు మంగిన అరుణ, జక్కంపూడి మదన్, సంగినీడి రంగారావు, గంధం ఏసు పాదం, సిరిగినీడి రాము,కానూరి ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## శాంతిభద్రతలపై సదస్సులో బాపట్ల పోలీస్ శాఖ నివేదిక

కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో పాల్గొన్న ఎస్పీ ఉమామహేశ్వర్



**బాపట్ల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 8వ జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డా.వినోద్‌కుమార్ వాసుదేవ తో కలిసి రెండో రోజు సమావేశానికి హాజరైన ఎస్పీ. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు.జిల్లాలో భద్రతా ఏర్పాట్లు, రోడ్డు ప్రమాదాల నివారణకు అమలు చేస్తున్న శిరోరక్ష, ప్రాణరక్ష కార్యక్రమం ద్వారా వస్తున్న ఫలితాలను సదస్సులో వివరించారు. మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల కట్టడి, శాంతిభద్రతలపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాల వారీగా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసి ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించేలా పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

## సీఐని సస్పెండ్ చేయాలి

జర్నలిస్టులు, ప్రజా సంఘాల డిమాండ్




**బేతంచర్ల:సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**పత్తికొండ విశాలాంధ్ర విలేకరి నాగరాజుపై దాడి చేసి, అనుచితంగా మాట్లాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ జయన్నను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకుడు దెబ్బ వెంకటరాముడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం బేతంచర్ల పాత బస్టాండ్‌లో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటరాముడు, సీపీఎం సీనియర్ నాయకుడు ఎల్లయ్య, సీపీఐ మండల కార్యదర్శి యన్నా భార్గవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పిట్టల జాకీర్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు జరగడం బాధాకరమన్నారు. నాగరాజుపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులను కాలరాసే అధికారులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.కార్యక్రమంలో విలేకరులు వెంకటేశ్వరగౌడ్, నాగమధు, బండ రాముడు, మదన భూపాల్‌నాయుడు, కత్తి సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఉదయ్‌తో పాటు సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కి కోటి 25 లక్షల తో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ను ప్రారంభించిన : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం




**గుంతకల్లు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** ప్రజలు రకరకాల ఆధునిక పరీక్షలు చేయించుకోవాలంటే సుదూర దూరాలకు వెళ్లాల్సిన పనిలేదని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి లో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ప్రారంభించడం జరిగిందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఆసుపత్రి లో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ఐపీఎస్ హాజరైనారు. గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యు లు గుమ్మనూరు జయరాం మరియు అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయ ణ ను ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కోటి 25 లక్షలతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువ చ్చి నట్లు తెలిపారు. ?ఒకే చోట సమగ్ర పరీక్షలు ఈ ల్యాబ్ ద్వారా రక్తం, మూత్రం, మైక్రోబయో లాజికల్, పాథాలజీ, బయోకెమిస్ట్రీ మరియు వ్యాధి నిర్ధారణకు సంబంధించిన అనేక రకాల అధునాతన పరీక్షలను ఉచితంగా నిర్వహించను న్నారునీ అన్నారు. ?తక్షణ ఫలితాలు గతంలో కొన్ని సంక్లిష్టమైన పరీక్షల కోసం అనంతపురం, కర్నూల్ కు ఇతర దూర ప్రాంతాలకు లేదా ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై ఆ అవసరం లేకుండా ఆసుప త్రిలోనే త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు. ?ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ల్యాబ్ సౌకర్యాన్ని గుంతకల్లు మరియు చుట్టూ పరిసర ప్రాంతాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్డిఓ శ్రీనివాస్, తాసిల్దార్ పుణ్యవతి, డిప్యూటీ తాసిల్దార్ సుబ్బలక్ష్మి, డి యశీ అండ్ హెచ్ఓ, గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, మరియు వైద్యాధికారులు, నర్సులు, ఆస్పత్రి సిబ్బంది, గుంతకల్లు మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శిరీషాదేవి పర్యటనకు టీడీపీ శ్రేణుల సమాయత్తం

### కూనవరం మండల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని కార్యకర్తల తీర్మానం

**కూనవరం, సెప్టెంబర్ 12: ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలంలో ఈ నెల 16వ తేదీన ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి పర్యటన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యవసర సమావేశం నిర్వహించారు. కూనవరం మండలం టేకులబోరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయడంతో పాటు మండలంలోని ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లడంపై ప్రధానంగా చర్చించారు. కార్యకర్తలు, నాయకుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పలువురు నాయకులు సూచించారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కూనవరం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, కలెక్టరేట్ ఇన్‌చార్జి మోసం రాము, కోశాధికారి





సోమక సత్యనారాయణ, కార్యదర్శి బట్టు భాస్కరరావు, శ్రీమంతుల సతీష్, నియోజకవర్గ ఎస్టీ కార్యవర్గ సభ్యులు సోడి మధుసూదన్‌రావు, బండారు శివయ్య, బూత్ ఇన్‌చార్జి బోడ వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జి దాసరి నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు దన్నూరి శ్రీనివాసరావు, మునేశ్వరరావు, కో-యూనిట్ సోడి వీరభద్రం, కార్యదర్శి నాసుపల్లి వెంకటేశ్వర్లు, బూత్ ఇన్‌చార్జులు ఎడ్ల రాంబాబు, ఎడ్ల వెంకటేశ్వర్లు, మండల ఎస్టీ కమిటీ అధ్యక్షులు కరక సర్వేశ్వరరావు, యూత్ నాయకులు ఎల్లంకి వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షులు చిచ్చడి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ధర్మల లక్ష్మణరావు, అంజన్‌రావు, చిన్నబి, సోడి సీతయ్య, మాడెం సీతారాములు, శ్రీమంతుల శ్రీనివాసరావు, ముచిక వెంకటేశ్వర్లు, కారం రత్తయ్య, పోడియం బుచ్చిరాజు, నాగిరెడ్డి, సింహాద్రి శీను, అరవ శేఖర్, తెల్లం పొద్దయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేస్తూ... మండల సమస్యల పరిష్కారానికి గళం వినిపిద్దామని టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

# నిమ్మలపాడు కాల్‌సైట్ మైనింగ్‌పై నలుగురు సభ్యుల కమిటీ విచారణ

### విచారణ సమయంలో ప్రజలు లేవనితిన న్యాయబద్ధమైన ప్రశ్నలు.
### పీసా తీర్మానం నుంచి రైతుల భూముల వరకుఏ.పీ.ఎం..డీ.సీపై గ్రామస్తుల ఫిర్యాదులు.
### అక్రమ మైనింగ్‌ను నిలిపివేసి గ్రామ సొసైటీకి మైనింగ్ హక్కులు కల్పించాలని డిమాండ్.

**అనంతగిరి మండలం. సెప్టెంబర్ 12. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం. వాలాసి పంచాయతీ నిమ్మలపాడు ప్రాంతంలో కొనసాగుతున్న కాల్‌సైట్ మైనింగ్‌పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నలుగురు సభ్యులతో కూడిన కమిటీ శుక్రవారం సమగ్ర విచారణ చేపట్టింది. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, మండల తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సభ్యులుగా ఉన్న కమిటీ నిమ్మలపాడు గ్రామస్తులు, రైతులు, సంబంధిత వర్గాల నుంచి వివరాలు సేకరించింది.మైనింగ్‌కు సంబంధించిన అనుమతులు, పీసా గ్రామసభ తీర్మానాలు, పంచాయతీ తీర్మానం, రైతుల భూముల కు సంబంధించిన పరిహారం, మైనింగ్ వల్ల వ్యవసాయ భూములకు జరుగుతున్న నష్టం, ఏ.పీ.ఎం.డీ.సీ నిర్వహిస్తున్న లీజులు టెండర్లు, గ్రామానికి రావాల్సిన ఆదాయం తదితర అంశాలపై గ్రామస్తులు కమిటీ ముందు తమ అభ్యంతరాలను, ఫిర్యాదులను స్పష్టంగా వెల్లడించారు.పీసా తీర్మానం విషయంలో తీవ్ర అభ్యంతరాలు గతంలో జరిగిన పీసా తీర్మానం సరైన విధానంలో జరగలేదని, గ్రామంలోని మెజార్టీ సభ్యుల సమక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా తీర్మానం ఆమోదం పొందలేదని గ్రామస్తులు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తీర్మానం దొంగచాటుగా జరిగినట్లుగా తమకు అనుమానాలు ఉన్నాయని, వాస్తవాలను పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు. అలాగే మైనింగ్‌కు సంబంధించి పంచాయతీ తీర్మానం కూడా లేదని కమిటీకి ఫిర్యాదు చేశారు.

**రైతులకు పరిహారం, బ్లాస్టింగ్‌పై ఆందోళన**

మైనింగ్ కార్యకలాపాల కారణంగా తమ వ్యవసాయ భూములు తీవ్రంగా నష్టపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్ సమయంలో పెద్ద పెద్ద రాళ్లు వ్యవసాయ భూములపై పడుతున్నాయని, పంటలకు మరియు భూములకు నష్టం కలుగుతోందని తెలిపారు. ఏ.పీ.ఎం.డీ.సీ నుంచి భూములు కోల్పోతున్న లేదా నష్టపోతున్న రైతులకు సరైన రీతిలో నష్టపరి హారం అందడం లేదని కమిటీ ముందు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సుమారు 20. ఎకరాల మేర జిరాయితి భూములు ఉన్న రైతులకు ఇప్పటివరకు ఏ.పీ.ఎం.డీ.సీ నుంచి తగిన చెల్లింపులు జరగలేదని గ్రామస్తులు ఆరోపించారు. రైతుల భూములు, జీవనోపాధి, వ్యవసాయంపై మైనింగ్ ప్రభావాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

**ఒక వ్యక్తికి లీజు ఇవ్వడంపై గ్రామస్తుల అభ్యంతరం.**

మైనింగ్‌కు సంబంధించిన టెండర్లు ఒక వ్యక్తికి అనుకూలంగా ఉండే విధంగా ఇచ్చారని గ్రామస్తులు కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ విధంగా వ్యక్తిగతంగా లీజులు ఇవ్వడం వల్ల గ్రామ ప్రజలు ఆర్థికంగా, వ్యవసాయపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.అక్రమంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చినట్లు తేలిన టెండర్లు, లీజులను ఏ.పీ.ఎం.డీ.సీ వెంటనే రద్దు చేసి, మైనింగ్ హక్కులను గ్రామ సొసైటీకి కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ సొసైటీ ద్వారా మైనింగ్ నిర్వహించడం వల్ల గ్రామ ప్రజలకు ఉపాధి, ఆదాయం, అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఒక వ్యక్తికి మైనింగ్ లీజు ఇవ్వడం వల్ల గ్రామస్తుల్లో విభజనలు ఏర్పడి, వర్గాల మధ్య గొడవలు పెరగడం తప్ప గ్రామానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని వారు కమిటీ ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామానికి రావాల్సిన 20.శాతం రాయల్టీ ఎక్కడ?**

ఇప్పటివరకు నిమ్మలపాడు ప్రాంతంలో జరిగిన మైనింగ్ ద్వారా వచ్చిన ఆదాయంలో, సమతా తీర్పు నేపథ్యంలో పంచాయతీకి రావాల్సిన 20.శాతం రాయల్టీ విషయాన్ని కూడా గ్రామస్తులు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు పంచాయతీకి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని వారు ఆరోపించారు. దీనిపై అధికారిక రికార్డులను పరిశీలించి, వాస్తవ పరిస్థితిని నివేదికలో స్పష్టంగా నమోదు చేయాలని కోరారు.మైనింగ్‌ను నిలిపివేసి వాస్తవాలను ప్రభుత్వానికి నివేదించాలి.మైనింగ్ వల్ల తమకు జరుగుతున్న నష్టాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, గ్రామ ప్రజల వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని నిమ్మలపాడు, రాళ్ల గరువు. కరకవలస ప్రాంతాల ప్రజలు కోరారు. అక్రమంగా మైనింగ్ జరుగుతున్నట్లు తేలితే వెంటనే కార్యకలాపాలను నిలిపివేసి,

**బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.**

అదేవిధంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 244.పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో పీసా గ్రామసభల నిబంధనలను పాటిస్తూ, గ్రామ ప్రజల సమ్మతి మరియు చట్టపరమైన ప్రక్రియలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే మైనింగ్‌పై నిర్ణయం తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.మైనింగ్ కారణంగా తమ వ్యవసాయ









భూములు, పంటలు, జీవనోపాధి, గ్రామ వాతావరణం దెబ్బ తింటున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి మైనింగ్ కొనసాగించడం సరికాదని వారు స్పష్టం చేశారు.కమిటీ వాస్తవాలను నిష్పక్షపాతంగా నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు, ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలని, ప్రజల కు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నిమ్మలపాడు ప్రాంత గ్రామస్తులు కోరారు. మైనింగ్ కొనసాగించడమే లక్ష్యంగా కాకుండా, గిరిజన గ్రామాల హక్కులు, రైతుల భూములు, ప్రజల జీవనోపాధి మరియు చట్టబద్ధమైన గ్రామసభ ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. నిమ్మలపాడు కాల్‌సైట్ మైనింగ్‌పై జరిగిన ఈ విచారణతో గ్రామస్తులు లేవనెత్తిన ఆరోపణలు, రైతుల సమస్యలు, మైనింగ్ అనుమతులు, లీజులు, పీసా గ్రామసభలు, పంచాయతీ ఆదాయం తదితర అంశాలపై అధికారికంగా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విచారణ శుక్రవారం రోజు జరిగింది.

# పినాకిల్‌కు ఆర్టీసీని అప్పగించొద్దు

**డోన్, సెప్టెంబరు 12(ప్రజా జ్యోతి)** విద్యుత్ బస్సుల పేరుతో ఏపీఎస్‌ఆర్టీసీని పినాకిల్ ప్రైవేటు సంస్థకు అప్పగించవద్దని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం డోన్ ఆర్టీసీ బస్టాండ్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డిపో మేనేజర్ చలపతికి కరపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల కో-కన్వీనర్ బి.నాగమద్దయ్య, మండల నాయకులు పి.రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రజలకు 75 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆర్టీసీని ప్రైవేటీకరణ పేరుతో నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. విద్యుత్ బస్సుల కొనుగోలుకు ప్రభుత్వానికి సబ్సిడీ లభిస్తున్నందున, బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని అన్నారు. పినాకిల్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం కిలోమీటరుకు రూ.72.55 చెల్లించాల్సి వస్తుందని, దీనివల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. 'స్త్రీ శక్తి' పథకం కింద ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సిన



రూ.1,680 కోట్లకు పైగా బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 12 వేల పోస్టులను భర్తీ చేయాలని, 4 వేల కొత్త బస్సులను ప్రవేశపెట్టాలని కోరారు. ఆర్టీసీకి చెందిన భూములు, డిపోలు, వర్క్‌షాప్‌లు, బస్టాండ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్ద న్నారు. గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు బస్సు సర్వీసులను విస్తరించాలని, ఉద్యోగుల హక్కులు, ఉపాధి భద్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అద్దె బస్సు యూనియన్ నాయకులు, డ్రైవర్లు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయతీ చాటిన 108 సిబ్బంది

**మానవత్వంతో రూ.50 వేల నగదు బాధిత కుటుంబానికి అప్పగింత**

**ప్రలోభాలకు లొంగకుండా ఆపద్బాంధవులుగా నిలిచిన సిబ్బంది**

**108 సిబ్బందిపై పలువురి ప్రశంసలు**



**ఎటపాక, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):** ప్రస్తుత సమాజంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు, స్వార్థం కనిపిస్తున్న తరుణంలో.. అందుకు భిన్నంగా ఎటపాక మండలం నెల్లిపాకకు చెందిన 108 అంబులెన్స్ సిబ్బంది నిజాయతీ, మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సంబంధించిన రూ.50 వేల నగదును గుర్తించి, బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించి తమ నిబద్ధతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లిపాకకు చెందిన 108 అంబులెన్స్ ఈఎంటీ లక్ష్మణ్, పైలెట్ మహేష్‌లు కొల్లుగూడెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించిన క్షతగాత్రుడిని భద్రాచలం తరలించేందుకు వెళ్లారు. బాధితుడిని భద్రాచలం ఆసుపత్రికి తరలించిన అనంతరం అంబులెన్స్‌తో తిరిగి నెల్లిపాక పీహెచ్‌సీకి చేరుకున్నారు. అంబులెన్స్‌లో రక్తం మరకలు ఉండటంతో సిబ్బంది వాహనాన్ని శుభ్రం చేస్తున్న సమయంలో ఓ కవర్ కనిపించింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ కవర్‌ను భద్రపరిచి బాధిత కుటుంబ సభ్యులను సంప్రదించేందుకు ప్రయత్నించారు. అయితే వారి ఫోన్ నంబర్‌కు సంప్రదింపు కాకపోవడంతో ఇతర మార్గాల ద్వారా భద్రాచలంలో ఉన్న బాధితుడి బంధువులను సంప్రదించి కవర్‌ను వారికి అప్పగించారు. కవర్‌ను అక్కడే తెరిచి పరిశీలించిన బాధితుడి బంధువులు అందులో రూ.50 వేల నగదు ఉన్నట్లు గుర్తించారు. నగదును ఎలాంటి ఆశకు లోనుకాకుండా నిజాయతీగా తిరిగి అందజేసిన 108 సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాద సమయంలో తమ కుటుంబానికి అందించిన వైద్య సేవలతో పాటు, నగదును కూడా భద్రంగా తిరిగి అందజేసిన సిబ్బంది చేసిన సాయం ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. దొరికిన నగదుపై దురాశకు లోనుకాకుండా, ప్రలోభాలకు తావివ్వకుండా బాధిత కుటుంబానికి తిరిగి అందజేసిన ఈఎంటీ లక్ష్మణ్, పైలెట్ మహేష్‌ల నిజాయతీపై పలువురు ప్రశంసలు కురిపించారు. ఆపదలో ప్రాణాలు కాపాడటమే కాకుండా.. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన 108 సిబ్బంది మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు.

# క్లోరోక్విన్‌తో అస్వస్థతకు గురైన కుటుంబాలకు వైసీపీ నేతల పరామర్శ

**ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఘటన: ఎంపీ గుమ్మా తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి**

**బాధితులను ఆదుకోవాలి.. మృతిచెందిన చిన్నారి కుటుంబానికి భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**


**డిమాండ్లు నెరవేర్చకపోతే మూడు రోజుల్లో భారీ రాస్తారోకో: వైసీపీ నేతల హెచ్చరిక**

**లక్ష్మీపురం పీహెచ్‌సీకి అంబులెన్స్, గొల్లగుప్ప రహదారికి సోలార్ లైట్లు: ఎంపీ హామీ**

**ఎటపాక, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):** భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు సాయిబాబా ఆలయాన్ని శనివారం ఉదయం దర్శించుకున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి అనంతరం ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామానికి చేరుకున్నారు. క్లోరోక్విన్ టాబ్లెట్ల కారణంగా అస్వస్థతకు గురైన బాధిత కుటుంబాలను ఎటపాక మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ గుమ్మా తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ.. క్లోరోక్విన్ టాబ్లెట్ల వినియోగంతో పలువురు అస్వస్థతకు గురైన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఘటనను వెలుగులోకి రాకుండా చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలిచి, మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనలో మృతిచెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం భారీ మొత్తంలో ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైతే మరో మూడు రోజులు వేచి చూసి, అనంతరం ఎటపాక మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే భారీ సంఖ్యలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.









**అభివృద్ధి పనులకు ఎంపీ హామీ**

ఈ సందర్భంగా ఎంపీ గుమ్మా తనూజ రాణి మాట్లాడుతూ.. లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌ను సమకూర్చడంతో పాటు గొల్లగుప్ప గ్రామానికి వెళ్లే రహదారికి సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఎంపీ నిధుల నుంచి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, ఎంపీపీ కాకా మేశ్వరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దామెర రేవతి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, యువజన విభాగం మండల అధ్యక్షుడు తోట శశికుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల దయాకర్, పబ్లిసిటీ విభాగం మండల అధ్యక్షుడు ముత్తిబోయిన రాము, ఎంపీటీసీ బూరం అంజలి, మండల కార్యదర్శి ముక్కు కల్పన, సీనియర్ నాయకులు రంభాల నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చిచ్చడి రామారావు, సర్పంచ్ లక్ష్మణ్, స్టూడెంట్ వింగ్ విభాగం అధ్యక్షుడు మైసాక్షి రాకేష్, గజ్జల శ్రీనివాస్, బత్తుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం





**– ఎర్రకోట రాజీవ్ రెడ్డి**

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి ):** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మిగ నూరులోని మాచని సోమప్ప మెమోరియల్ హాల్లో శనివారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తానే స్వయంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. టీడీపీ, కూటమి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా పోటీ చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా జరగనున్న నేపథ్యంలో కష్టపడి పనిచేస్తే విజయం సాధించవచ్చన్నారు.ప్రభుత్వం పింఛన్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోనెగండ్ల, నందవరం మండలాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బెదిరిస్తున్నారనే ఆరోపణలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టినా భయపడాల్సిన అవసరం లేదని, ప్రత్యేక లీగల్ టీమ్‌తో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే తన బలం, ధైర్యమని పేర్కొంటూ ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని రాజీవ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రైతు కోసం రోడ్డెక్కిన కోన

**పిట్టలవానిపాలెంలో ముగిసిన మూడు రోజుల రైతు భరోసా పాదయాత్ర**

**బాపట్ల, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** వర్షాభావంతో సాగు ప్రశ్నార్థకంగా మారి రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు చేపట్టిన రైతు భరోసా పాదయాత్ర ముగిసింది. పిట్టలవానిపాలెం మండలంలో మూడో రోజు కొనసాగిన పాదయాత్రతో మూడు రోజుల కార్యక్రమానికి ముగింపు పలికారు.నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి నేతృత్వంలో సాగిన పాదయాత్రలో పలు గ్రామాల మీదుగా ప్రయాణిస్తూ రైతులను కలిశారు. వర్షాలు లేక పంటల సాగు పరిస్థితి, సాగునీటి ఇబ్బందులు, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిళ్లపై వారి నుంచి వివరాలు సేకరించారు.రైతుల సమస్యలు కేవలం గ్రామాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ దృష్టికి వెళ్లేలా చేయడమే పాదయాత్ర ఉద్దేశమని కోన రఘుపతి తెలిపారు. రైతులకు సాగునీటి భరోసా కల్పించడంతో పాటు ప్రస్తుత పరిస్థితుల్లో వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు.మూడు రోజులుగా సాగిన పాదయాత్రలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మట్టి గణపతే మేలైన మార్గం

**పర్యావరణ హిత వినాయక చవితికి ప్రజలు ముందుకు రావాలి**

**అటవీశాఖ డిప్యూటీ రేంజర్ బాలకృష్ణ**







**బాపట్ల సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** వినాయక చవితి వేడుకల్లో భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ డిప్యూటీ రేంజర్ బాలకృష్ణ పిలుపునిచ్చారు. కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించేలా చైతన్యం పెంచుకోవాలన్నారు.బాపట్ల జిల్లా పాత బస్టాండ్ కూడలిలో కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలు, అటవీశాఖ, బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ సంయుక్తంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ భట్టు ఆధ్వర్యంలో పర్యావరణహిత వినాయక చవితి ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ. రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులకు కలిగే కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తూనే ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సుభాషిణి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, విజయ్, ప్రొటెక్ట్ కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి, డీఎఫ్ఓ రాజేష్, ప్రియాంక, నవనీతం తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటి బస్టాండ్‌లో కమ్యూనిటీ బేస్డ్ స్క్రీనింగ్ క్యాంపు




**రాయచోటి, సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ ఎస్ఎసిఎస్) సూచనలు, ఆదేశాల మేరకు రాయచోటి బస్టాండ్‌లో కమ్యూనిటీ బేస్డ్ స్క్రీనింగ్ (సిబిఎస్ ) క్యాంపు నిర్వహించారు.క్యాంపులో ప్రజలకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవీ రిస్క్ అసెస్‌మెంట్ కోసం క్యూఆర్ కోడ్ స్కానింగ్ నిర్వహించారు.అలాగే 95:95:95 లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ క్యాంపులో మొత్తం 120 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేసారు క్యాంపును ప్రజా చైతన్య సేవా సంఘం (పి సి ఎస్ ఎస్ పి యు) ప్రాజెక్ట్ డైరెక్టర్ జి . చెన్నారెడ్డి సందర్శించి, క్యాంపులో నిర్వహిస్తున్న స్క్రీనింగ్, అవగాహనకార్యక్రమాలను పరిశీలించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పి సి ఎస్ ఎస్ సిబ్బంది ప్రాజెక్టు మేనేజర్ టీ స్వాతి ,ఏఎన్ఎం చంద్రకళ , ఓ ఆర్ డబ్ల్యు ఎస్ నరసమ్మ, నిమ్రా , పి ఈ లు ప్రియాంక, జయలక్ష్మి పాల్గొని విజయవంతం చేశారు

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి .........

**కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు.....**



**చాగలమర్రి , సెప్టెంబర్ 12( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పన కూటమి ప్రభుత్వంతో సాధ్యమవుతుందని చాగలమర్రి టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆలంసాగారి మౌళాళి,నాల్గవ ఎంపీటీసి ఇన్‌చార్జ్ జెట్టి నాగరాజు లు తెలియజేసారు. చాగలమర్రి పట్టణంలోని భవాని నగర్,రిక్వెస్ట్ స్టేజీ,కూలూరు రస్తాలో శనివారం 224 బూతు ఇన్‌చార్జ్ వెంకటయ్య(గాంధీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గం అభివృద్ధి బాటలో పరుగులెడుతోందన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి,సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సనస్యలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్ళి పరిస్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజేంద్ర,టైలర్ ఖాదర్,బారిక్ చామల్,అబ్దుల్లా,రమేష్, రాజేష్,ప్రకాష్, మహబూబ్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగుమర్రిలో ఘనంగా శ్రీకృష్ణ ఊరేగింపు







**ప్యాపిలి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి న్యూస్ ):** ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ప్రబోధ సేవాసమితి – జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ ఊరేగింపు కార్యక్రమంలో గౌరవనీయులు డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి ఆదర్శమని పేర్కొంటూ, యువత ధార్మిక మరియు సాంస్కృతిక విలువలను పరిరక్షించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువ నాయకులు శ్రీ కోట్ల రాఘవేంద్ర రెడ్డి గారు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అరిగెల సుధాకర్, మొప్పురి కృష్ణ, మొప్పురి లక్ష్మీనారాయణ, అరిగెల శివ, సంఘటి రాజ్, సంయుక్త, సురేష్ సుధాకర్, జ్యోతిరాము, నిర్మల, పూర్ణమూర్తి, శ్రీనివాసులు, రమేష్ తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు, టీడీపీ నాయకులు, మొపూరి రామకృష్ణ, శంకర్, మొపూరి రాము కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి అధునాతన వైద్య పరీక్షల బలం

**రూ 40 లక్షలతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ ప్రారంభం**



**చీరాల సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)** ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా చీరాల ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ (ఐపిహెచ్ఎల్) శనివారం అందుబాటులోకి వచ్చింది. రూ 40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ల్యాబొరేటరీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్వాసుదేవ, ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య. ఆసుపత్రిలోని ల్యాబొరేటరీని పరిశీలించారు. వివిధ విభాగాలను పరిశీలించి, రిబ్బన్ కట్ చేసి సేవలను ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం, ఉచిత పరీక్షల సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. చీరాల ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. ఐపిహెచ్ఎల్ అందుబాటులోకి రావడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. త్వరలోనే క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో సాంకేతికతను మరింత విస్తరించే దిశగా సంజీవిని ప్రాజెక్టు ద్వారా సేవలను బలోపేతం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జనవరి నుంచి డిజిటల్ మెడికల్ రికార్డులను ప్రవేశపెట్టే చర్యలు చేపడుతున్నామని, దీనివల్ల వైద్య సేవల్లో మరింత వేగం, పారదర్శకత వస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ యోగా, ధ్యానం, ప్రాణాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సుభాషిణి, ఏఎంసీ చైర్మన్ కౌతారపు జనార్ధన్, సివిల్ సర్జన్ డాక్టర్ పి.శ్రీకాంత్, ఆర్ఎంవో ఈ.హరిబాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలే స్ఫూర్తి

**కూనవరంలో 2వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘన నివాళి**

**మతతత్వం--విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయాలి : సీపీఎం మండల కార్యదర్శి బాబు బోరయ్య**



**కూనవరం సెప్టెంబర్ 12. ప్రజా జ్యోతి** భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తనదైన ముద్ర వేసిన గొప్ప మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఎం కూనవరం మండల కార్యదర్శి బాబు బోరయ్య అన్నారు. కూనవరం మండల సీపీఎం పార్టీ కార్యాలయం మార్త శ్రీరామ్మూర్తి భవనంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు బోరయ్య మాట్లాడుతూ... 1952 ఆగస్టు 12న జన్మించిన కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితులై ఎస్ఎఫ్ఐలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడారని, అత్యవసర పరిస్థితి సమయంలో నిర్బంధాలు, అణచివేతలను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ధైర్యంగా నిలిచారని గుర్తు చేశారు. సీపీఐ(ఎం)లో అంచెలంచెలుగా ఎదిగిన ఏచూరి 1992లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికై, 2015 నుంచి 2024 వరకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం అందించారని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రజా సమస్యలను బలంగా వినిపించారని అన్నారు. మతతత్వానికి వ్యతిరేకంగా, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, కార్మికులు, రైతులు, గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితాంతం పోరాడారని తెలిపారు. మార్క్సిజం--లెనినిజం సిద్ధాంతాలను భారత సామాజిక పరిస్థితులకు అన్వయిస్తూ పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారని కొనియాడారు. 2024 సెప్టెంబర్ 12న కామ్రేడ్ సీతారాం ఏచూరి భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ప్రజా ఉద్యమాల పట్ల ఆయనకున్న నిబద్ధత, మార్క్సిస్టు సిద్ధాంతంపై విశ్వాసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన పోరాటం ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. కార్మికులు, కర్షకులు గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతూ, మతతత్వం--విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను బలోపేతం చేయడమే కామ్రేడ్ ఏచూరి ఆశయాలకు నిజమైన నివాళి అని బాబు బోరయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాస్, తెల్లం తమ్మయ్య, మాడెం బాబు, మడకం నాగమణి, ఎంపీటీసీ ధర్మల అమ్మాజీ, సోడే శంకర్, మడకం శ్రీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఘన నివాళి



**చింతూరు సెప్టెంబర్ 12ప్రజాజ్యోతి** అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి చెంది రెండవ ఏడాది ప్రజా సమస్యల పరిష్కారం మే ప్రధాన కర్తవ్యం కమ్యూనిస్టు పార్టీ నిర్మాణమే జీవిత లక్ష్యంగా తుది శ్వాస విడిచే వరకు పనిచేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సీతారాం విద్యార్థి దశ నుండి విద్యార్థుల సమస్యలపై పోరాట మార్గాన్ని ఎంచుకొని ఉన్నత చదువులలో గోల్డ్ మెడల్ సాధించి అనేక ఉద్యోగ అవకాశాలు వచ్చిన ఈ దేశంలోని పేదరిక నిర్మూలన మారక్స్ అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఘన నివాళి అర్పించారు. చింతూరు కేంద్రంలో పార్టీ కార్యాలయం నందు మాజీ పార్టీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించడం జరిగింది అనంతరం పాల్గొన్న కార్యకర్తలను ఉద్దేశించి మండల కార్యదర్శి పల్లపు వెంకట్ నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి విద్యార్థుల సమస్యలపై పోరాట మార్గాన్ని ఎంచుకొని ఉన్నత చదువులలో గోల్డ్ మెడల్ సాధించి అనేక ఉద్యోగ అవకాశాలు వచ్చిన ఈ దేశంలోని పేదరిక నిర్మూలన మార్క్ లిస్ట్ పార్టీ విధానాలతోటే సాధ్యమవుతుందని నమ్మి విద్యార్థి యువజన కార్మిక సమస్యలపై హైదరాబాదు నుండి ఢిల్లీ వరకు వెళ్లి జాతీయ నాయకులకు మహా మేధావులుగా అనేక జాతీయ సమస్యలపై సుదీర్ఘంగా వివరణాత్మకంగా మాట్లాడే నాయకుడు సీతారాం ఏచూరి దేశ పార్లమెంట్లో ఉత్తమ పార్లమెంటు ఎన్నిక పురస్కారం అందుకున్న మహోన్నత వ్యక్తి ఈ దేశంలో మతోన్మాద కార్పోరేట్ శక్తుల దోపిడీపై ప్రజలు ఏకం కావాలని ఈ కుతంత్రాలకు వ్యతిరేకంగా కార్మికులను పేదలను ఐక్యం చేసి ఈ దేశంలోనూ ఎర్రజెండా రెపరెపలు కొనసాగాలని కోరిన మహా వ్యక్తి ఏచూరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చోడ్ దుర్గారావు, రమేష్, పలుపు రాములు, కుంజ శ్రీను, కమలేష్, పెద్దలు పాల్గొన్నారు మార్క్సిస్ట్ పార్టీ సీపీఎం విధానాలతోటే సాధ్యమవుతుందని నమ్మి విద్యార్థి యువజన కార్మిక సమస్యలపై హైదరాబాదు నుండి ఢిల్లీ వరకు వెళ్లి జాతీయ నాయకులకు మహా మేధావులుగా అనేక జాతీయ సమస్యలపై సుదీర్ఘంగా వివరణాత్మకంగా మాట్లాడే నాయకుడు సీతారాం ఏచూరి దేశ పార్లమెంట్లో ఉత్తమ పార్లమెంటు ఎన్నికై పురస్కారం అందుకున్న మహోన్నత వ్యక్తి ఈ దేశంలో మతోన్మాద కార్పోరేట్ శక్తుల దోపిడీపై ప్రజలు ఏకం కావాలని ఈ కుతంత్రాలకు వ్యతిరేకంగా కార్మికులను పేదలను ఐక్యం చేసి ఈ దేశంలోనూ ఎర్రజెండా రెపరెపలు కొనసాగాలని కోరిన మహా వ్యక్తి ఏచూరి అని అన్నారు నేడు రాష్ట్రంలోని దేశంలోని పాలకులుగా ఉన్న ఎన్డీఏ కూటమి నేతలు ప్రజా సమస్యలను వదిలి కార్పొరేట్ సేవలో తరించిపోతున్నారని దేశ సంపదను ప్రజల సంపదను దోసి పెట్టడం మహా గొప్ప సేవగా ప్రకటనలు చేస్తున్నారని ఏజెన్సీ ప్రాంతంలోని చట్టాలను నీరుగారుస్తూ కార్పొరేటర్ శక్తులకు సహజ సంప్రదిని కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఈ ప్రయత్నాలపై మన పోరాటాలను ఉధృతం చేయాలని అన్నారు. నేటి తరం యువత ఈ దేశం కోసం సామాన్య ప్రజానీకం కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకునేందుకు ఆయన జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉందని అన్నారు సీతారాం ఏచూరి చూపిన బాటను ప్రతి కార్యకర్త పట్టుదలగా ఎర్రజెండా తోడుగా ముందుకు సాగాలని కోరారు ఈ కార్యక్రమంలో చోడ్ దుర్గారావు, రమేష్, పలుపు రాములు, కుంజ శ్రీను, కమలేష్, పెద్దలు పాల్గొన్నారు

## వైసీపీ నాయకులకు స్థానిక ఎన్నికల గురించి మాట్లాడే అర్హత లేదు

**పిల్లిండ్ల మహేష్ తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి**

**రామాపురం సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి** వైసీపీ నాయుకులు రానున్న స్థానిక ఎన్నికల గురించి ఏదో వాళ్ల ఇష్టానుసారం మాట్లాడుతున్నారు, పోయిన 2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా చేసారో మర్చిపోయారా, రామాపురం మండల విషయానికే వస్తే ఒక ఎంపీటీసీ కానీ జడ్పిటిసి ఎన్నిక జరిగిందా ప్రతి గ్రామాలలో కూడా టీడీపీ నాయకులు మరియు ఇతర నాయకులు నామినేషన్లు వేస్తే వాటిని ఎలా చేశారో మర్చిపోయారా. ఇప్పుడు ఏకగ్రీవం అయితే ఈసారి వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వను అని వాళ్ల నాయకుడు అంటున్నాడు. ఆయన చెప్తున్నాడు అని ఇక్కడ పోటీ చేస్తాం అనే నాయకులకి సిగ్గు ఉందా అని అడుగుతున్న పోయిన స్థానిక ఎన్నికల్లో అధికారం ఉంది అని విర్రవీగి మా నాయకులు వేసిన నామినేషన్లు చించి, మరి కొన్నిట్లో అవి తప్పు ఇవి తప్పు అని ఆర్వో గారిని అప్పటి స్థానిక ఎమ్మెల్యే ద్వారా ఒత్తిడి తెచ్చి నామినేషన్లు తెరస్కరించారు, ఇవి అన్ని మర్చిపోయి ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తాం మీరు ఇప్పుడు ఎలా పోటీ చేస్తారో మా రాముడు అన్న అండతో మేము చూస్తాం అని తెలిపారు.




## శ్రీ సీతారాముల కళ్యాణం రమణీయం........

కమనీయం........

అంబాపురం శ్రీ అభయాంజనేయ స్వామికి విశేష పూజలు........



**చాగలమర్రి , సెప్టెంబర్ 12( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం అంబాపురం గ్రామంలో ( మూడురాళ్ళపల్లె గ్రామం వెళ్ళే దారిలో ) శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యములో శ్రీ సీత రాముల కళ్యాణం పూజారి కైప వెంకట నరసింహ శాస్త్రి ఆధ్వర్యములో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు రమణీయంగా కమనీయంగా వీక్షించారు. ప్రతి శనివారం వైభవంగా పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు శంకరాచారి తెలిపారు. పూజారి కైప వెంకట నరసింహ శాస్త్రి ఆధ్వర్యములో గణపతి పూ జ నిర్వహించారు. ప్రతి శనివారం దాదాపుగా 1000 మందికి పైగా రాత్రి అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భజన బృందంతో ప్రతి శనివారం భజన కార్యక్రమం చేస్తున్నారు. కళ్యాణం అనంతరం వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. భక్త బృందాలతో రామ స్మరణలతో మారుమ్రోగిన ఆలయ ప్రాంగణం. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన మౌర్య రెడ్డి



**రాయచోటి సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి** పేద, మధ్యతరగతి ప్రజల కోసం ?5కే భోజనం అందించే అన్న క్యాంటీన్‌లో మంత్రి మేనల్లుడు, టీడీపీ యువ నాయకులు మౌర్య రెడ్డిలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలపై భారం పడకుండా ?5 ఖర్చును కూడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు భరిస్తూ ఉచితంగా భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్‌లో ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రత, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న పేద ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని మౌర్య రెడ్డి తెలిపారు.

## 20వ రోజుకు హైకోర్టు బెంచ్ సాధన దీక్ష





**కర్నూలు సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి న్యూస్ )** స్టాఫ్ రిపోర్టర్ కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు ఈదిగా సురేంద్ర గౌడ్, ఎం. రమేష్, బి. సావిత్రమ్మ, అబ్దుల్ సమద్, కే. గోపీచంద్ నాయక్, జే. దామోదర్ రెడ్డి, బీసీ రాజుతో పాటు న్యాయ విద్యార్థి పి. మనీషా గౌడ్ దీక్షలో పాల్గొన్నారు. కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి. చంద్రుడు మాట్లాడుతూ.. అధికారపక్షానికి చెందిన ఏ ఒక్క నాయకుడు ఇప్పటివరకు దీక్షా శిబిరాన్ని సందర్శించలేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు శిబిరాన్ని సందర్శించి న్యాయవాదుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. నిన్న ప్రజా సంఘాలతో కలిసి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించామని, శాశ్వత హైకోర్టు బెంచ్ సాధించే వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. న్యాయవాదులు చేస్తున్న దీక్షకు పాస్టర్ సంఘం సభ్యులు జయకాంత్, ప్రభుదాస్, శాంతిరాజ్, స్టాన్లీ, దానమయా సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి చంద్రుడు, ప్రధాన కార్యదర్శి టి మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జే. రసూల్ ఖాన్, సీనియర్ న్యాయవాదులు వి. నాగలక్ష్మి దేవి, వై జయరాజ్ తదితరులు మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.

# 24 దుకాణాల కేటాయింపులో అక్రమాలపై టీడీపీ మహిళా నేత రాయుడు దుర్గ ధ్వజం

## పేదల బతుకు కోసం నిర్మించినవి దళారుల చేతుల్లోకి?

## లాటరీ విధానంలో పారదర్శకంగా 24 మంది లబ్ధిదారుల ఎంపిక చేయాలని డిమాండ్

**కాకినాడ, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన వ్యాపార సముదాయమే ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువుగా మారింది. కాకినాడ నగరపాలక సంస్థ సాధారణ నిధులు 63 లక్షలతో 2023 సెప్టెంబరులో కాకినాడ సంజయ్‌నగర్‌లో నిర్మించిన 24 దుకాణాల కేటాయింపులో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటు న్నాయంటూ స్థానిక తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు రాయుడు దుర్గ సొంత పార్టీ వారి పైనే తీవ్ర ఆరోపణలు చేశారు. పేదల కోసం నిర్మించిన దుకాణాలు నిజమైన అర్హులైన లబ్ధిదారులకు దక్కకుండా రాజకీయ పలుకుబడి, దళారుల వ్యవస్థకు కేంద్రంగా మారుతున్నాయా? అంటూ ఆమె నిలదీశారు.సంజయ్‌నగర్ స్లమ్ ప్రాంతంలో నివసించే అనేక కుటుంబాలకు చిన్నచిన్న వ్యాపారాలే జీవనాధారం. భర్తను కోల్పోయిన మహిళలు, వికలాంగులపై ఆధారపడి జీవించే కుటుంబాలు, రోజువారీ కూలీ లేదా చిరు వ్యాపారాలతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే నిరుపేదలు ఇక్కడ అధికంగా ఉన్నారని రాయుడు దుర్గ పేర్కొన్నారు. అలాంటి వర్గాలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన దుకాణాలకు ఇప్పుడు అర్హత కన్నా డబ్బు, సామాజిక అవసరం కన్నా రాజకీయ పరిచయాలు ప్రాధాన్యం పొందుతున్నాయనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు.స్థానిక ఎమ్మెల్యే అండదండలతో కొందరు డివిజన్ స్థాయి నాయకులు దళారులను రంగంలోకి దింపి ఒక్కొక్క దుకాణానికి 50 వేల వరకు వసూలు చేస్తున్నారంటూ ఆమె సొంత పార్టీ నేతల పైనే ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉందని, సంబంధిత అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**తాము 50 వేలు ఎక్కడి నుంచి తేవాలి?....**

"రోజు కూలి చేస్తేనే ఇంట్లో పొయ్యి వెలిగే కుటుంబాలు 50 వేలు ఎలా చెల్లించగలవు? పేదల కోసం నిర్మించిన దుకాణానికి పేదవాడే అర్హుడైతే. అతని వద్ద నుంచి ఇంత మొత్తాన్ని ఎవరు, ఎందుకు అడగాలి?" అని రాయుడు దుర్గ ప్రశ్నించారు.బ్రతుకుతెరువు నిమిత్తం దుకాణం కోసం ఎదురుచూస్తున్న నిజమైన పేద కుటుంబాలకు ఈ వ్యవహారం తీవ్ర నిరాశను కలిగిస్తోందన్నారు. వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించాల్సిన దుకాణాలే అప్పు చేసి డబ్బు చెల్లించాల్సిన పరిస్థితిని సృష్టిస్తే, ఆ పథకం అసలు ఉద్దేశమే నీరుగారిపోతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.






**లాటరీతోనే న్యాయం సాధ్యమా?....**

24 దుకాణాలకు 24 మంది అర్హులైన లబ్ధిదారులను నిబంధనల ప్రకారం బహిరంగంగా ఎంపిక చేసి, పారదర్శక లాటరీ విధానంలో కేటాయించాలని రాయుడు దుర్గ డిమాండ్ చేశారు. దరఖాస్తుదారుల జాబితా, అర్హత ప్రమాణాలు, ఎంపిక విధానం, కేటాయింపు ప్రక్రియను బహిరంగపరచాలని కోరారు. ఎవరెవరు దరఖాస్తు చేశారు? ఎవరి అర్హత ఏమిటి? ఎంపికకు ఏ ప్రమాణాలను అనుసరించారు? లాటరీ జరిగిందా? జరిగితే ఎప్పుడు, ఎవరి సమక్షంలో జరిగింది? దుకాణాల కేటాయింపులో ఎటువంటి రుసుములు అధికారికంగా నిర్ణయించారు? వంటి అంశాలపై నగరపాలక సంస్థ అధికారులు స్పష్టమైన వివరాలు వెల్లడించాలని ఆమె కోరారు.నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి 63 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ వ్యాపార సముదాయం ప్రజల ఆస్తి అని రాయుడు దుర్గ గుర్తుచేశారు. అందువల్ల దాని కేటాయింపులో చిన్నపాటి అనుమానం వచ్చినా అధికారులు పారదర్శకంగా వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఆస్తి రాజకీయ పలుకుబడికి లేదా దళారుల జోక్యానికి వేదికగా మారకూడదని స్పష్టం చేశారు. నిజమైన పేదలకు నిజమైన ప్రయోజనం అందుతుందా? లేక పేదల పేరుతో నిర్మించిన షాపులు పలుకుబడి ఉన్నవారికి చేరుతున్నాయా? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారిందన్నారు.సంజయ్‌నగర్ 24 దుకాణాల వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై కాకినాడ నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణ, కేటాయింపు విధానం, అధికారిక రుసుముల వివరాలను వెల్లడిస్తే అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.పేదల కోసం నిర్మించిన దుకాణాలు పేదలకే దక్కాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని, అక్రమాలకు తావులేకుండా బహిరంగ లాటరీ నిర్వహించి 24 మంది అర్హులైన లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించాలని దుర్గ స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఆస్తుల విషయంలో రాజకీయ జోక్యానికి, దళారుల దందాకు అవకాశం ఇవ్వకూడదని రాయుడు దుర్గ డిమాండ్ చేశారు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభోత్సవం చేసిన నాయకుల పేర్లపై నల్లని రంగు పూసిన శిలాఫలకం అక్కడ దర్శనమిస్తోంది..

# విదేశీ మారక నిల్వల్లో భారత్ రికార్డు

## రష్యాను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో స్థానానికి..!

భారతదేశ ఆర్థికవ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. ఆర్బీఐ చేపట్టిన ప్రత్యేక పథకం కారణంగా దేశంలోకి డాలర్ల ప్రవాహం రికార్డు స్థాయిలో పెరగడంతో విదేశీ మారక నిల్వలు ఆల్-టైమ్ గరిష్ఠానికి చేరాయి. దీంతో ఫారెక్స్ నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి ఎగబాకింది. 'బ్లూమ్‌బర్గ్' డేటా ప్రకారం.. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో భారత ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.9 బిలియన్ డాలర్లు పెరిగి 785.7 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయి. ఈ భారీ పెరుగుదలతో ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న రష్యాను భారత్ వెనక్కి నెట్టింది. ప్రస్తుతం ఈ జాబితాలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత్ కంటే ముందు ఉన్నాయి. ఆర్బీఐ ఈ ఏడాది జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారెన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ల స్పెషల్ స్వాప్ పథకానికి అనూహ్య స్పందన లభించడమే ఈ డాలర్ల వరదకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ పథకం ద్వారా కేవలం 11 వారాల్లోనే దేశంలోకి 73 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. నిర్దేశిత లక్ష్యం గడువు కంటే ముందే నెరవేరడంతో, ఆర్బీఐ ఈ పథకాన్ని సెప్టెంబర్ 30కి బదులుగా ఆగస్టు 31నే ముగించింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దేశ పసిడి నిల్వల విలువ 2.59 బిలియన్ డాలర్లు తగ్గినా, డాలర్ల ప్రవాహం అధికంగా ఉండటంతో మొత్తం నిల్వలు భారీగా పెరిగాయి. విదేశీ మారక నిల్వలు ఇంత భారీగా పెరగడం దేశ ఆర్థికవ్యవస్థ పటిష్ఠతకు సంకేతమని, ఇది రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు స్థిరీకరించేందుకు ఆర్బీఐకి మరింత బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.



# కొత్త బంగారంగా రాగి.. పెట్టుబడిదారుల చూపంతా దీనిపైనే!

విలువైన లోహాలు అంటే.. ముందుగా మనకు గుర్తొచ్చేది బంగారం, వెండి మాత్రమే. పెట్టుబడిదారులు కూడా చాలాకాలంగా వీటినే సురక్షితమైన పెట్టుబడి మార్గాలుగా చూస్తున్నారు. అయితే.. ఇప్పుడు పరిస్థితి కొంత మారుతోంది. రాగి ధరలు భారీగా పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకోవడంతో.. కొందరు దీనిని కూడా కొత్త బంగారంగా అభివర్ణిస్తున్నారు. గత ఏడాది బంగారం ధర దాదాపు 70 శాతం, వెండి ధర ఏకంగా 150 శాతం వరకు పెరిగాయి. ఇదే సమయంలో అల్యూమినియం, పల్లాడియం, ప్లాటినమ్‌తో పాటు రాగి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి.

**భారీగా పెరిగిన రాగి ధరలు**

లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో రాగి ధరలు సరికొత్త రికార్డును నమోదు చేశాయి. ఒక దశలో మెట్రిక్ టన్ను రాగి ధర 14,737 డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.14 లక్షలకు సమానం. తవ్వకం, శుద్ధి సామర్థ్యాలకు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌కు మధ్య అంతరం పెరుగుతుండటంతో.. రాగి ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. రాగి ధరలు పెరగడానికి అమెరికా సుంకాల ప్రభావం కూడా ఒక ముఖ్యమైన కారణం. శుద్ధి చేసిన రాగి దిగుమతులపై అమెరికా సుంకాలు పెంచే అవకాశం ఉందన్న వార్తలతో కొనుగోలుదారులు ముందుగానే పెద్ద మొత్తంలో రాగిని కొనుగోలు చేస్తున్నారు. 2026 తొలి అర్ధభాగంలో అమెరికా సుమారు 8.85 లక్షల టన్నుల రాగిని దిగుమతి చేసుకుంది. దీంతో ప్రపంచంలోని రాగి నిల్వల్లో గణనీయమైన భాగం అమెరికాకు తరలిపోయింది. ఫలితంగా లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో అందుబాటులో ఉన్న నిల్వలు తగ్గాయి. ఇది ధరలు పెరగడానికి కారణమైంది.

**ప్రధాన కారణాలు**

మార్కెట్‌లో రాగికి చాలాకాలంగా డిమాండ్ ఉంది. అయితే డిమాండుకు తగిన సరఫరా లేదు. ప్రపంచంలో ఉన్న పాత రాగి గనులు తమ ఉత్పత్తిని పెంచడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రధాన రాగి ఉత్పత్తి దేశాల్లో కూడా ఉత్పత్తి, రవాణాకు సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయి. రాగికి డిమాండ్ పెరగడానికి మరో ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్లు భారీగా నిర్మిస్తున్నారు. ఈ డేటా సెంటర్లలో విద్యుత్ వ్యవస్థలు, కేబుల్స్, నెట్‌వర్క్ పరికరాలు వంటి వాటిలో రాగిని విస్తృతంగా ఉపయోగిస్తారు. అంతే కాకుండా.. సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన రంగాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల విస్తరణ కూడా రాగికి డిమాండ్‌ను పెంచుతున్నాయి.



అంటే.. భవిష్యత్తులో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాలు పెరిగే కొద్దీ రాగి అవసరం కూడా పెరిగే అవకాశం ఉంది.

**భారీ డిమాండ్**

ఈ ఏడాది ఇప్పటి వరకు రాగి ధరలు సుమారు 16 శాతం పెరిగాయి. ముఖ్యంగా.. ఇటీవల నమోదైన రికార్డు ధరలు మార్కెట్ విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయాయి. కొన్ని ప్రముఖ బ్రోకరేజీలు 2026లో రాగి ధరలు టన్నుకు 11,000-12,000 డాలర్ల స్థాయిలో ఉంటాయని అంచనా వేసినప్పటికీ, మార్కెట్ ధరలు ఇప్పటికే ఆ స్థాయిని దాటిపోయాయి. దీంతో రాగి మార్కెట్‌పై పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరిగింది.

# సమస్యలతో వచ్చిన వారికి చేయూత లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె వి సుబ్బారెడ్డి



**కర్నూలు సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి న్యూస్ )** స్టాఫ్ రిపోర్టర్ కర్నూలు నగరానికి పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించుకునేందుకు నేషనల్ లోక్ అదాలత్ కు హాజరైన బాధితులకు భోజనం భారం కాకూడదన్న ఉద్దేశంతోనే తమ వంతుగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె వి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కె వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాము అందిస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమానికి నేషనల్ న్యూట్రిషన్ వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా కర్నూలు జర్నలిస్టు అసోసియేషన్ ముందుకు వచ్చి కోడిగుడ్లను పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం రెండు గుడ్లు భుజిస్తే వారి ఆరోగ్యం సుఖవంతంగా ఉంటుందని తెలిపేందుకు వారోత్సవాల్లో భాగంగా కోడిగుడ్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.సమస్యలు పరిష్కారం కోసం వచ్చిన వారికి కె వి ఎస్ ఆర్ ఫౌండేషన్ తరపున ఒక పూట ఉచిత భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము గత పదేళ్లుగా తనను సంప్రదించిన వారికి అవసరమైన మేరకు తన వంతుగా ఉచితంగా అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు హాజరయ్యే వారికి కూడా అన్నదానం చేసినట్లు గుర్తు చేశారు.అంతకు ముందు లోక్ అదాలత్ కు హాజరైన వారందరికీ జడ్జితో కలిసి స్వయంగా వారు అన్నదాన వితరణ చేశారు.

# టాటా పంచ్ మరింత ప్రియం..

## రూ 20 వేల వరకు రేటు పెంచిన సంస్థ




**న్యూఢిల్లీ :** దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఈవీ మోడళ్లలో ఒకటైన పంచ్ ఈవీ ధరను మరోసారి పెంచింది టాటా. ఈ మోడల్ ధరను రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సవరిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతో ఈ కారు ధర రూ.9.79 లక్షల నుంచి రూ.12.99 లక్షల మధ్యలోకి చేరుకున్నది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మార్కెట్లోకి విడుదల చేసినప్పుడు ఈ కారు ధర రూ.9.69 లక్షలుగా ఉండేది. వీటిలో 30 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మోడల్ ధరను రూ.10 వేలు పెంచిన సంస్థ.. 40 కిలోవాట్ల బ్యాటరీ మోడల్‌ను రూ.20 వేలు సవరించింది. సింగిల్‌చార్జింగ్‌తో 30 కిలోవాట్ల బ్యాటరీ మోడల్ 375 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 40 కిలోవాట్ల బ్యాటరీ మోడల్ 468 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో ఈవీ, సిట్రాయిన్ ఈసీ3, ఎంజీ కొమ్మెట్ ఈవీ, విండ్‌సర్ ఈవీలకు పంచ్ గట్టి పోటీనివ్వనున్నది.

# హీరో గ్లామర్.. ఇప్పుడు కొత్త హంగులతో..




హీరో మోటోకార్ప్.. దేశీయ మార్కెట్లో అత్యధిక అమ్మకాలు పొందుతున్న గ్లామర్ బైకుకు కొత్త అప్డేట్స్ తీసుకొచ్చింది. కంపెనీ ఇప్పుడు ఇందులో సింగిల్ ఛానల్ ఏబీఎస్, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ (ఐబీఎస్) లను కలిపి రూపొందించిన కొత్త బ్రేకింగ్ సిస్టమ్ అందిస్తుంది. దీని ధర రూ. 1.01 లక్షలు (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ). 125 సీసీ సెగ్మెంట్‌లో సింగిల్-ఛానల్ ఏబీఎస్, ఐబీఎస్ వంటివాటితో వస్తున్న మొట్టమొదటి మోటార్‌సైకిల్ గ్లామర్ ఎక్స్ 125 అని హీరో పేర్కొంది. ఈ కొత్త బ్రేకింగ్ హార్డ్‌వేర్ గట్టిగా బ్రేక్ వేసినప్పుడు ముందు చక్రాలు లాక్ అవ్వకుండా నివారిస్తుంది, అదే సమయంలో ఐబీఎస్ ముందు, వెనుక బ్రేకులను అనుసంధానించడం ద్వారా బ్రేకింగ్ పనితీరును మెరుగుపరుస్తుంది. గ్లామర్ ఎక్స్ బైకులో పానిక్ బ్రేక్ అలర్ట్, హజార్డ్ ల్యాంప్స్ వంటి ఫీచర్లు కూడా కొనసాగుతున్నాయి. హీరో గ్లామర్ ఎక్స్‌లో 124.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజన్ ఉంటుంది. ఇది 8,250 తీజూఎ వద్ద 11.4ఎహ్ట్రజూ పవర్.. 6,500తీజూఎ వద్ద 10.5చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ మోటార్‌సైకిల్‌లో ఎకో, రోడ్, పవర్ అనే మూడు రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. అంతేకాకుండా.. ఇందులో క్రూజ్ కంట్రోల్ కూడా ఉంది. హీరో గ్లామర్ ఎక్స్ 125లో బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, కాల్, ఎస్ఎమ్ఎస్ అలర్ట్‌లతో కూడిన కలర్ టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్ ఉంది. ఇతర ఫీచర్లలో ఫుల్ ఎల్ఈడీ లైటింగ్, యూఎస్బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, సీటు కింద మొబైల్ స్టోరేజ్ వంటివి ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్-ూదీూతో కూడిన గ్లామర్ ఎక్స్ గన్ మెటల్ గ్రే, మ్యాట్ యాక్సిస్ గ్రే, బ్లాక్ పెర్ల్ రెడ్, బ్లాక్ టీల్ బ్లూ అనే నాలుగు రంగులలో లభిస్తుంది.



# 'సలార్' ఫైట్ పాక్‌లో కాపీ.. అసలు నిజమేంటి?

పాన్ ఇండియా స్టార్ అయిన తర్వాత ప్రభాస్ చేసిన ఫుల్ లెంగ్త్ యాక్షన్ సినిమా 'సలార్'. కేజీఎఫ్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించేసరికి ఈ మూవీపై విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. కానీ విడుదల విషయంలో పలుమార్లు వాయిదా పడటంతో ఎందుకనో థియేటర్లలో సరిగా పెర్ఫార్మ్ చేయలేదు. కానీ తర్వాత కాలంలో ఓటీటీ, టీవీలో ప్రసారమైన తర్వాత విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పటికీ ఏదో ఒక సందర్భంలో 'సలార్' గురించి వినిపిస్తూనే ఉంటుంది. కానీ రీసెంట్‌గా కొన్నిరోజుల నుంచి 'సలార్' ఫైట్ సీన్‌ని పాకిస్తాన్‌కి చెందిన ఓ సినిమాలో కాపీ కొట్టారని చెప్పి సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. కానీ ఇది ఏ మాత్రం నిజం కాదు. పాక్‌కి చెందిన హసీబ్ బిలాల్ అనే ఇన్ఫ్లుయెన్సర్.. ఏఐ ఉపయోగించి 'సలార్' స్ఫూర్తిగా తన ప్రతిరూపంలో వీడియో సృష్టించి దానిని తన ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. చూడటానికి ఇది రియల్‌గా ఉండేసరికి చాలామంది ఇది నిజమని అనుకుంటున్నారు. ఇకపోతే ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్, కల్కి 2 సినిమాలతో ప్రభాస్ బిజీగా ఉండగా.. మరోవైపు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' చేస్తున్నాడు. మరి వీళ్లు ఈ ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాత 'సలార్ 2' కోసం కలుస్తారేమో చూడాలి? దీని కోసం ప్రభాస్ ఫ్యాన్స్ కాస్త గట్టిగానే ఎదురుచూస్తున్నారు.

# రచ్చ లేపడానికి రెడీ.. ఒక్క పోస్టుతో 'స్వయంభూ'పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నిఖిల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "'స్వయంభూ' ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న 'భూమి' పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వపు మూలాలతో, ఒక యోధుడి గాథ ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న 'స్వయంభూ' విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నా సినిమాలను నేను చూడలేను

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.



## మహిళలు మాత్రమే తాళి వేసుకోవాలా.. పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు. నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.



# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' టీజర్ ఇదిగో.. నవ్వులతో మొదలై థ్రిల్లింగ్ మలుపు!

తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్లలో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లది ఒకటి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నెం: 47 / ఏకే 47) సినిమా నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ వచ్చింది. తాజాగా విడుదలైన ఈ చిత్రం టీజర్, అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్ ఆరంభం నుంచి త్రివిక్రమ్ మార్క్ స్పష్టంగా కనిపించింది. సరికొత్త లుక్‌లో కనిపించిన వెంకటేశ్, తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో కట్టిపడేశారు. "డబ్బు సబ్బు లాంటిది రా, చేతులు కడుక్కోవడానికే పనికొస్తుంది", కుటుంబం అప్పుల లెక్కలు చెప్పే సన్నివేశాలు, వంటింట్లో జరిగే సంభాషణలు ప్రేక్షకుల పెదాలపై నవ్వులు పూయించాయి. మధ్యతరగతి కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను వినోదాత్మకంగా చూపిస్తూనే, కథలో కీలక మలుపును పరిచయం చేశారు. కుటుంబమంతా కలిసి 'ఏకే 47' అనే పేరున్న ఓ డ్యూప్లెక్స్ ఇంట్లోకి మారడంతో కథ మరో స్థాయికి వెళుతుంది. అంతా సంతోషంగా సాగుతున్న సమయంలో ఓ క్రైమ్ సంఘటన జరగడం, విలన్ ఎంట్రీతో టీజర్ ఒక్కసారిగా సీరియస్ టర్న్ తీసుకుంటుంది. దీంతో ఈ సినిమా కేవలం కుటుంబ కథ మాత్రమే కాదని, ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉన్నాయని స్పష్టమవుతోంది. కామెడీ, ఎమోషన్స్, సస్పెన్స్‌తో కూడిన ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను త్రివిక్రమ్ సిద్ధం చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. నారా రోహిత్, దివ్యేందు శర్మ, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమయ్యారు. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. నిర్మాతలు ఈ చిత్రాన్ని గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విడుదలైన కొద్ది గంటల్లోనే విశేష స్పందన రాబట్టుకున్న ఈ టీజర్, సినిమాపై ఉన్న అంచనాలను తారాస్థాయికి చేర్చింది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,